RNI No: TGTEL/25/A2649

VOICE OF PRAJALU

# వాయిస్ ఆఫ్ ప్రజలు

ప్రజల గొంతుక - నిజం కోసం..

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMABAD ADILABAD

హైదరాబాద్ | ఆదివారం, సెప్టెంబరు 13, 2026 | తెలుగు దినపత్రిక | సంపుటి:1 | సంచిక : 131 | పేజీలు: 8 | వెల : రూ.1

## ఉప్పల్-నారపల్లి ఫ్లైఓవర్ వచ్చే ఏడాది జూన్‌కు



2027 జూన్ నాటికి అందుబాటులోకి తెస్తాం..

పనుల్లో జాప్యానికి కాంట్రాక్టర్ వివాదాలే కారణం : మంత్రి కోమటిరెడ్డి

# 5.46 లక్షల దరఖాస్తులను పరిష్కరించాం



### ధరణి సమయంలో కారణాలు చెప్పకుండానే అప్లికేషన్లు తిరస్కరించారు: మంత్రి పొంగులేటి

హైదరాబాద్, సెప్టెంబర్ 12 (వాయిస్ టుడే): ధరణి సమయంలో భూ సమస్యల పరిష్కారం కోసం వచ్చిన 10 లక్షల దరఖాస్తులను కారణాలు చెప్పకుండానే తిరస్కరించారని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పేదలు చెప్పులు అరిగేలా తిరిగినా వారికి న్యాయం జరగలేదని పేర్కొన్నారు. భూ సమస్యలపై అప్పీల్ చేసుకునే అవకాశం కూడా లేకుండా ధరణి వ్యవస్థను రూపొందించారని మంత్రి విమర్శించారు. అధికారుల నిర్ణయాలపై అప్పీల్ చేసుకునేందుకు ప్రత్యేక అథారిటీ లేకపోవడం దురదృష్టకరమన్నారు. ధరణికి ప్రత్యామ్నాయంగా భూభారతి చట్టాన్ని తీసుకొచ్చామని తెలిపారు. దేశంలోని 18 రాష్ట్రాలకు అధికారులను పంపించి అక్కడి భూ చట్టాలు, విధానాలను అధ్యయనం చేసి, మంచి అంశాలను భూభారతిలో పొందుపరిచామని చెప్పారు. భూభారతి ద్వారా ఇప్పటివరకు లి5.46 లక్షల దరఖాస్తులను పరిష్కరించామనిలి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.



# గణేశ్ ఉత్సవాలపై సీఎం రేవంత్ కీలక ఆదేశాలు

### ఉత్సవాలు ముగిసే వరకు మున్సిపల్, పోలీస్ శాఖల నిరంతర పర్యవేక్షణ.. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్

హైదరాబాద్, సెప్టెంబర్ 12 (వాయిస్ టుడే): హైదరాబాద్ మహానగరంలో గణేశ్ ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంతంగా, సాఫీగా జరిగేలా మున్సిపల్, పోలీస్ శాఖలు సమన్వయంతో నిరంతరం పర్యవేక్షించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఉత్సవాల పర్యవేక్షణ, సమన్వయానికి ప్రత్యేక అధికారులను నియమించాలని సూచించారు. శాసనసభ ఆవరణలోని మండలి సమావేశ మందిరంలో గణేశ్ ఉత్సవ ఏర్పాట్లపై సీఎం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, మహమ్మద్ అజారుద్దీన్, ఎంపీ వేం నరేందర్‌రెడ్డి, నగర ప్రజాప్రతినిధులు, జీహెచ్‌ఎంసీ, సీఎంసీ, ఎంఎంసీ, హైడ్రా కమిషనర్లు, పోలీసు ఉన్నతాధికారులు, గణేశ్ ఉత్సవ కమిటీ ప్రతినిధులు సమావేశంలో పాల్గొన్నారు. గణేశ్ ఉత్సవాల పర్యవేక్షణ కోసం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారు. హైదరాబాద్ ప్రశాంతంగా ఉన్నప్పుడే పెట్టుబడులు వస్తాయని, శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాల నిర్వహణలో నిర్వాహకులు ప్రభుత్వానికి సహకరించాలని సీఎం కోరారు. ఏవైనా సమస్యలు ఉంటే

(మిగతా 2వ పేజీలో)

# కొండా సురేఖకు ఢిల్లీ పిలుపు



### మంత్రి పదవి కోల్పోయిన మరుసటి రోజే రంగంలోకి కాంగ్రెస్ అధిష్ఠానం

హైదరాబాద్, సెప్టెంబర్ 12 (వాయిస్ టుడే): మంత్రి పదవి నుంచి తొలగించిన కొండా సురేఖకు కాంగ్రెస్ అధిష్ఠానం ఢిల్లీకి రావాల్సిందిగా పిలుపునిచ్చినట్లు సమాచారం. వెంటనే ఢిల్లీకి బయలుదేరి రావాలని పార్టీ పెద్దల నుంచి సందేశం అందినట్లు కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. మంత్రి పదవి నుంచి తొలగించిన మరుసటి రోజే అధిష్ఠానం ఆమెతో సంప్రదింపులు జరపడం తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది. తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ కొండా సురేఖతో ఫోన్‌లో మాట్లాడినట్లు సమాచారం. పార్టీ నిర్ణయాన్ని గౌరవించాలని, అధిష్ఠానం అండగా ఉంటుందని ఆమెకు హామీ ఇచ్చినట్లు కాంగ్రెస్ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో కొండా సురేఖను బుజ్జగించేందుకు అధిష్ఠానం చర్యలు చేపట్టినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఆమెకు కేబినెట్ హోదా కలిగిన పదవి ఇచ్చే అవకాశం ఉందన్న ప్రచారం కూడా సాగుతోంది. అధిష్ఠానం పిలుపు మేరకు కొండా సురేఖ ఢిల్లీ వెళ్లనున్న నేపథ్యంలో, ఆమెతో పార్టీ పెద్దల చర్చల అనంతరం తదుపరి పరిణామాలపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

# మాక్ అసెంబ్లీలో బీఆర్ఎస్ సెటైర్లు



### తలసాని సీఎం.. మాణిక్‌రావు స్పీకర్.. కాంగ్రెస్ ప్రభుత్వంపై పల్లా, కేటీఆర్ విమర్శలు

హైదరాబాద్, సెప్టెంబర్ 12 (వాయిస్ టుడే): బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మాక్ అసెంబ్లీ రాజకీయంగా ఆసక్తికరంగా మారింది. జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు స్పీకర్‌గా, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ముఖ్యమంత్రి పాత్రలో వ్యవహరించారు. మాక్ అసెంబ్లీలో తలసాని శ్రీనివాస్‌యాదవ్ ప్రభుత్వంపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ఎప్పుడు అమలు చేస్తామో చెప్పలేదని, ఐదేళ్లు కాదు.. 25 ఏళ్లు తామే అధికారంలో ఉంటామని వ్యాఖ్యానించారు. సభలో సభ్యులు సబ్జెక్ట్ తప్ప ఏమైనా మాట్లాడుకోవచ్చంటూ సెటైర్లు వేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఇరిగేషన్ మంత్రి పాత్రలో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. కర్ణాటకలో 40 శాతం కమీషన్లు తీసుకుంటే, తెలంగాణలో 30 శాతం కమీషన్లు తీసుకుంటున్నారని

(మిగతా 2వ పేజీలో)



# త్రిప్రయార్ ఆలయంలో దీపారాధన సేవలో పవన్

### శ్రీరామస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు.. ఆలయ సంప్రదాయాల ప్రకారం సేవల్లో పాల్గొన్న డిప్యూటీ సీఎం

తిరువనంతపురం, సెప్టెంబర్ 12 (వాయిస్ టుడే): ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కేరళలోని ప్రసిద్ధ త్రిప్రయార్ శ్రీరామస్వామి ఆలయాన్ని సందర్శించారు. ప్రస్తుతం ఆయుర్వేద చికిత్స కోసం కేరళలో ఉన్న ఆయన ఆలయానికి చేరుకుని శ్రీరామస్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో విశిష్టంగా భావించే లి'దీపారాధన' సేవలోలి పవన్ కల్యాణ్ పాల్గొన్నారు. ఒకరోజు దీపారాధన సేవకు విరాళం అందించి, ఆలయ ప్రధాన ద్వారం ఎదురుగా ఉన్న శ్రీకృష్ణ మందిరంలోని ప్రధాన దీపాలను వెలిగించారు. ఆలయ సంప్రదాయాల ప్రకారం నిర్వహించే లి'మీనుట్టు', 'వేది వజిపాడు'లి సేవల్లోనూ ఆయన పాల్గొన్నారు. అనంతరం శ్రీరామస్వామివారి దివ్య మంగళరూపాన్ని దర్శించుకుని సంధ్యాకాల అర్చనలు నిర్వహించారు. శ్రీరామస్వామివారితో పాటు ఆలయ ప్రాంగణంలోని శ్రీకృష్ణుడు, అయ్యప్పస్వామికి పట్టు వస్త్రాలు సమర్పించారు. దక్షిణామూర్తి, వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ అర్చకుల నుంచి తీర్థప్రసాదాలు, వేదాశీర్వచనాలు స్వీకరించారు. అంతకుముందు ఆలయ బోర్డు చైర్మన్, కమిటీ సభ్యులు పవన్ కల్యాణ్‌కు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయానికి సమీపంలోనే పవన్ కల్యాణ్ ఆయుర్వేద చికిత్స పొందుతున్నారు.



# గ్లోబల్ సౌత్ లీడర్‌గా భారత్

### బ్రిక్స్ వేదికగా అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రయోజనాలకు పెద్దపీట.. ఏకాభిప్రాయం సాధించడమే కీలకం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12 (వాయిస్ టుడే): ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, అంతర్జాతీయ రాజకీయాల్లో అనిశ్చితి నెలకొన్న నేపథ్యంలో

(మిగతా 2వ పేజీలో)

## 2034 నాటికి తెలంగాణను ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యం

### హైదరాబాద్ భవిష్యత్ అవసరాల కోసం 'క్యూర్' చట్టం.. సమగ్ర మొబిలిటీ ప్లాన్ సిద్ధం: మంత్రి శ్రీధర్‌బాబు



హైదరాబాద్, సెప్టెంబర్ 12 (వాయిస్ టుడే): 2034 నాటికి తెలంగాణను లిఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగాలి, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల స్థాయికి తీసుకెళ్లడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్‌లో భాగంగా ఈ లక్ష్యాలను నిర్దేశించుకున్నట్లు శాసనసభలో చెప్పారు. హైదరాబాద్ రాబోయే 20--30 ఏళ్ల అవసరాలకు అనుగుణంగా వికేంద్రీకృత, సమర్థవంతమైన పాలన అందించేందుకే లికోర్ అర్బన్ రీజియన్ ఇంటిగ్రేటెడ్ గవర్నెన్స్ (CURE) చట్టం-2026లి తీసుకొచ్చినట్లు మంత్రి వివరించారు. ఆధునిక సాంకేతికతతో వేగవంతమైన, పారదర్శకమైన, ప్రజలకు చేరువైన నగర పాలన అందించడమే దీని ఉద్దేశమన్నారు. ఐటీ, ఫార్మా, లైఫ్ సైన్సెస్, ఏరోస్పేస్, డేటా సెంటర్లు, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లకు హైదరాబాద్ ప్రధాన కేంద్రంగా ఎదిగిందని శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. 2025--26లో రాష్ట్ర జీఎస్‌డీపీ 10.7 శాతం వృద్ధితో రూ.17.82 లక్షల కోట్లకు చేరిందని, ఇందులో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాల వాటా కీలకమని తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్డు వరకు నగరం విస్తరించిన నేపథ్యంలో ఆ పరిధికి ప్రత్యేక కార్యనిర్వాహక వ్యవస్థను

(మిగతా 2వ పేజీలో)

వాయిస్
ఆదివారం, సెప్టెంబరు 13, 2026

# గ్లోబల్ సౌత్ లీడర్‌గా భారత్

భారత్ గ్లోబల్ సౌత్‌కు కీలక నాయకత్వ పాత్ర పోషించే అవకాశం ఉందని దక్షిణాసియా వ్యవహారాల నిపుణుడు మైఖేల్ కుగెల్‌మన్ అభిప్రాయపడ్డారు. 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు ద్వారా భారత్ తన దౌత్య, నాయకత్వ సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు, బ్రిక్స్‌లోని కొన్ని దేశాల అమెరికా వ్యతిరేక వైఖరి మధ్య సమతుల్యత సాధిస్తూ సభ్య దేశాల మధ్య ఏకాభిప్రాయం తీసుకురావడం భారత్‌కు ప్రధాన సవాలని కుగెల్‌మన్ పేర్కొన్నారు. రష్యా–ఉక్రెయిన్ యుద్ధం, పశ్చిమాసియా పరిణామాలపై భిన్న వైఖరులు ఉన్న దేశాలను ఒకే వేదికపైకి తీసుకురావడం భారత దౌత్య నైపుణ్యానికి పరీక్షగా మారనుందని విశ్లేషించారు.




### గ్లోబల్ సౌత్‌కు బలమైన గొంతుక

కరోనా మహమ్మారి, ఆర్థిక సంక్షోభ సమయాల్లో భారత్ పలు దేశాలకు వ్యాక్సిన్లు, ఆహార ధాన్యాలు, అత్యవసర వైద్య సహాయం అందించిందని కుగెల్‌మన్ గుర్తుచేశారు. అన్ని దేశాలతో భారత్‌కు ఉన్న దౌత్య సంబంధాల కారణంగా అంతర్జాతీయ ఉద్రిక్తతలను తగ్గించడంలో మధ్యవర్తిగా వ్యవహరించే సామర్థ్యం ఉందన్నారు. జీ20 అధ్యక్ష బాధ్యతల సమయంలో ఆఫ్రికన్ యూనియన్‌ను శాశ్వత సభ్యుడిగా చేర్చడంలో భారత్ కీలక పాత్ర పోషించిందని పేర్కొన్నారు. దీంతో గ్లోబల్ సౌత్‌కు అంతర్జాతీయ వేదికపై మరింత ప్రత్యక్ష ప్రాతినిధ్యం లభించిందన్నారు. అమెరికా, పాశ్చాత్య దేశాలతో వ్యూహాత్మక, రక్షణ సంబంధాలను కొనసాగిస్తూనే రష్యా, ఇతర బ్రిక్స్ దేశాలతో ఇంధన, వాణిజ్య సహకారాన్ని కొనసాగించడం భారత్ అనుసరిస్తున్న సమతుల్య దౌత్యానికి నిదర్శనమని విశ్లేషించారు.

### ప్రత్యామ్నాయ వాణిజ్య మార్గాలపై దృష్టి

గ్లోబల్ సప్లై చైన్ అంతరాయాలను తగ్గించేందుకు ప్రత్యామ్నాయ వాణిజ్య మార్గాలను అభివృద్ధి చేయడంలో భారత్ కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. భారత్–మధ్యప్రాచ్యం–యూరప్ ఆర్థిక కారిడార్ (×వీజుజ) వంటి ప్రాజెక్టుల ద్వారా వాణిజ్య మార్గాలను బలోపేతం చేయడంతో పాటు, ఇతర దేశాలపై అధిక ఆధారపడే పరిస్థితిని తగ్గించేందుకు భారత్ ప్రయత్నిస్తోందన్నారు. హిందూ మహాసముద్ర ప్రాంతంలో భారత నౌకాదళం 'ఫస్ట్ రెస్పాండర్'గా వ్యవహరిస్తూ వాణిజ్య నౌకలకు భద్రత కల్పించడం కూడా అభివృద్ధి చెందుతున్న దేశాల వాణిజ్య ప్రయోజనాలకు ఉపయోగపడుతోందన్నారు. అదేవిధంగా ఇండియా స్టాక్, యూపీఐ, డిజిలాకర్ వంటి డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ నమూనాలను ఇతర అభివృద్ధి చెందుతున్న దేశాలతో పంచుకోవడం ద్వారా ఆర్థిక సమగ్రతకు భారత్ దోహదపడుతోందని తెలిపారు.

### బ్రిక్స్‌ను పశ్చిమ వ్యతిరేక వేదికగా మార్చొద్దు

ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి, ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్ వంటి అంతర్జాతీయ సంస్థల్లో అభివృద్ధి చెందుతున్న దేశాలకు మరింత ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరం ఉందని కుగెల్‌మన్ పేర్కొన్నారు. ముఖ్యంగా ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాల ప్రయోజనాలకు భారత్ బలమైన మద్దతు ఇస్తోందన్నారు. బ్రిక్స్ పశ్చిమ దేశాలకు వ్యతిరేక వేదికగా మారకుండా లిఆర్థిక అభివృద్ధి, సౌత్–సౌత్ సహకారం, పరస్పర వాణిజ్యంలి వంటి అంశాలపై దృష్టి పెట్టాలని సూచించారు. స్థానిక కరెన్సీల్లో లావాదేవీలు, న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు ద్వారా అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఆర్థిక సహాయం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. ఇరాన్, సౌదీ అరేబియా, యూఏఈ ఒకే బ్రిక్స్ వేదికలో ఉండటం వల్ల పశ్చిమాసియా విభేదాలు మరింత సంక్లిష్టంగా మారాయని విశ్లేషించారు. మేలో జరిగిన బ్రిక్స్ మంత్రివర్గ సమావేశం సంయుక్త ప్రకటన లేకుండానే ముగిసిన నేపథ్యంలో, ఈసారి సభ్య దేశాల మధ్య సంయుక్త ప్రకటనపై ఏకాభిప్రాయం సాధించడం భారత్‌కు కీలక దౌత్య విజయంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలో భారత్ యుద్ధానికి బదులుగా చర్చలు, దౌత్యం ద్వారా సమస్యలకు పరిష్కారం కోరుతోందని, బ్రిక్స్‌ను పశ్చిమ వ్యతిరేక కూటమిగా మార్చకుండా గ్లోబల్ సౌత్ ప్రయోజనాల కోసం సమతుల్య వైఖరిని కొనసాగిస్తోందని విశ్లేషణలు చెబుతున్నాయి. బ్రిక్స్‌లో సభ్య దేశాల సంఖ్య పెరగడంతో ఏకాభిప్రాయం సాధించడం మరింత సవాలుగా మారిందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# గిరిజనుల్లో నమ్మకం నింపిన నాయకుడు పవన్ కళ్యాణ్

## డోలీ రహిత ఆంధ్రప్రదేశ్ దిశగా అడుగులు..

## గిరిజన గ్రామాలకు రహదారుల నిర్మాణం: నాగబాబు



పార్వతీపురం, సెప్టెంబర్ 12 (వాయిస్ టుడే):లి గిరిజనుల్లో తమ జీవితాలు కూడా మారుతాయనే నమ్మకాన్ని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కల్పించారని జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి, ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్ నాగబాబు అన్నారు. శనివారం పార్వతీపురంలో నిర్వహించిన జనసేన నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. పవన్ కళ్యాణ్ ఉప ముఖ్యమంత్రిగా, పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి పనులు వేగం పుంజుకున్నాయని నాగబాబు తెలిపారు. రహదారులు, రవాణా, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. గిరిజన ప్రాంతాల్లో జనసేనకు పెద్దగా రాజకీయ ప్రాతినిధ్యం లేకపోయినా, వారి సమస్యలను మానవతా దృక్పథంతో పరిష్కరించేందుకు పవన్ కళ్యాణ్ కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.

### డోలీ రహిత ఏపీ లక్ష్యం

'అడవి తల్లి బాట' కార్యక్రమం ద్వారా జనాభా తక్కువగా ఉన్న గిరిజన గ్రామాలకు సైతం రహదారి సౌకర్యం కల్పించే చర్యలు చేపట్టారని నాగబాబు తెలిపారు. అత్యవసర వైద్యం కోసం గిరిజనులు డోలీలపై ఆధారపడే పరిస్థితిని తొలగించేందుకు లి'డోలీ రహిత ఆంధ్రప్రదేశ్'లి లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. గిరిజన గ్రామంలో రహదారి, విద్యుత్ సౌకర్యాలు లేవని ఓ గ్రామస్థుడు వీడియో ద్వారా పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకురాగా, ఆయన వెంటనే స్పందించి రూ.10 కోట్ల నిధులతో పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకున్నారని నాగబాబు వివరించారు. సమస్య ఏ ప్రాంతానికి చెందినదైనా, ఏ పార్టీకి చెందిన వారైనా స్పందించడం పవన్ కళ్యాణ్ నాయకత్వ ప్రత్యేకత అని అన్నారు.

### గిరిజన గ్రామాలను సందర్శించాలి

ప్రతి జనసైనికుడు గిరిజన గ్రామాలను సందర్శించి అక్కడి ప్రజలతో మమేకం కావాలని నాగబాబు పిలుపునిచ్చారు. వారి సమస్యలు, అవసరాలను తెలుసుకుని తమ పరిధిలో పరిష్కరించగల సమస్యలకు తక్షణ సహాయం చేయాలని సూచించారు. పరిష్కారం సాధ్యం కాని సమస్యలను పార్టీ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. గిరిజనులకు అండగా నిలవడం సేవా కార్యక్రమంగా కాకుండా బాధ్యతగా భావించాలని కోరారు.

### పచ్చదనం 50 శాతానికి పెంచడమే లక్ష్యం

ఆంధ్రప్రదేశ్‌లో పచ్చదనాన్ని 50 శాతానికి పెంచే లక్ష్యంతో చర్యలు చేపడుతున్నామని నాగబాబు తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ జీవితంలోని ప్రత్యేక సందర్భాలను మొక్కలు నాటే కార్యక్రమాలతో ముడిపెట్టుకోవాలని సూచించారు. స్థానిక వాతావరణానికి అనువైన మొక్కలను నాటి వాటిని సంరక్షించడం ద్వారా పర్యావరణ సమతుల్యతను కాపాడవచ్చన్నారు. పచ్చదనం పెరిగితే భూగర్భ జలాలు, జీవ వైవిధ్యం, ఉపాధి అవకాశాలకు కూడా ప్రయోజనం కలుగుతుందని చెప్పారు.

### నాగబాబు సమక్షంలో జనసేనలో చేరికలు

పార్వతీపురం జిల్లా పర్యటన సందర్భంగా నాగబాబు సమక్షంలో పలువురు ప్రముఖులు జనసేన పార్టీలో చేరారు. తూర్పు కాపు సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ పాలవలస యశస్వి ఆధ్వర్యంలో ఏపీఎస్‌ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెదమజ్జి సత్యనారాయణతో పాటు ఎస్.వెంకటరమణ, ఆవాల భాస్కరరావు, ఆవాల నాయుడు తదితరులు పార్టీలో చేరారు. కార్యక్రమంలో పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, శ్రీకాకుళం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ కొరికాన రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నైతికత కోల్పోయిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు

## అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలపై మాట్లాడే ఆలోచన లేదు.. మాక్ అసెంబ్లీ పేరుతో వెకిలి చేష్టలు: ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి




హైదరాబాద్, సెప్టెంబర్ 12 (వాయిస్ టుడే): బీఆర్‌ఎస్ నిర్వహించిన మాక్ అసెంబ్లీపై భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలపై ప్రశ్నించే నైతికతను బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కోల్పోయారని విమర్శించారు. కేసీఆర్ ఒక రోజు ముందే బీఆర్‌ఎస్ ఎల్పీ సమావేశం నిర్వహించి ఎమ్మెల్యేలను రెచ్చగొట్టారని చామల ఆరోపించారు. నల్ల టీషర్టులపై పేర్లు రాసుకుని అసెంబ్లీకి రాకుండా, సభలోనే ప్రజా సమస్యలను ప్రస్తావించవచ్చుకదా అని ప్రశ్నించారు. అసెంబ్లీ గేటు వద్ద పోలీసులతో వివాదానికి దిగిన బీఆర్‌ఎస్ నేతలు.. ఇప్పుడు మాక్ అసెంబ్లీ నిర్వహించడం ఏంటని నిలదీశారు. దళితులను, అసెంబ్లీ స్పీకర్‌ను బీఆర్‌ఎస్ అవమానించిందని చామల ఆరోపించారు. మాక్ అసెంబ్లీ పేరుతో సీఎం, మంత్రులను ఇష్టానుసారం దూషించారని, వెకిలి చేష్టలకు పాల్పడ్డారని విమర్శించారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలకు అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలపై మాట్లాడే ఆలోచన లేదని అన్నారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు రాజకీయాలను పక్కనపెట్టి నాటకాలు, రికార్డింగ్ డ్యాన్సుల్లో పాల్గొనాలని చామల వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. వినాయక చవితి, దసరా, దీపావళి ఉత్సవాలకు వారి అవసరం ఉందని, సంక్రాంతికి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను ఏపీకి పంపిస్తామని ఎద్దేవా చేశారు. బీఆర్‌ఎస్ నేతల తీరును ప్రజలు హాస్యాస్పదంగా చూస్తున్నారని చామల కిరణ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు.

# ఉప్పల్--నారపల్లి ఫ్లైఓవర్ వచ్చే ఏడాది జూన్‌కు

## 2027 జూన్ నాటికి అందుబాటులోకి తెస్తాం..

## పనుల్లో జాప్యానికి కాంట్రాక్టర్ వివాదాలే కారణం: మంత్రి కోమటిరెడ్డి



హైదరాబాద్, సెప్టెంబర్ 12 (వాయిస్ టుడే): హైదరాబాద్ నగర వాహనదారులకు మరో కీలక ఎలివేటెడ్ కారిడార్ అందుబాటులోకి రానుంది. లిఉప్పల్--నారపల్లి ఫ్లైఓవర్ నిర్మాణాన్ని 2027 జూన్ నాటికి పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామనిలి రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. గురువారం శాసనమండలిలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. వాస్తవానికి ఈ ఎలివేటెడ్ కారిడార్‌ను ఈ ఏడాది దసరా నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ, వివిధ కారణాలతో పనుల్లో జాప్యం జరిగిందని మంత్రి తెలిపారు. కాంట్రాక్టర్ నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్‌ను ఆశ్రయించడంతో మధ్యలో సెకండరీ ఏజెన్సీని రంగంలోకి తీసుకురావాల్సి వచ్చిందని వివరించారు. ప్రస్తుతం పనులను వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని కోమటిరెడ్డి తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి జోక్యంతో ప్రాజెక్టు పనులను వేగంగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ఇటీవల నేషనల్ హైవేస్ రీజినల్ ఆఫీస్ అధికారులు, చీఫ్ ఇంజినీర్‌తో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించినట్లు వెల్లడించారు. జాతీయ రహదారి--163పై ఉప్పల్--నారపల్లి ఫ్లైఓవర్ నిర్మాణాన్ని కేంద్ర ప్రభుత్వం చేపట్టింది. సుమారు లిరూ.425 కోట్ల అంచనా వ్యయంతో 2018లోలి పనులు ప్రారంభమయ్యాయి. మూడేళ్లలో ప్రాజెక్టును పూర్తి చేయాలని తొలుత లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ వివిధ కారణాలతో పనులు ఆలస్యమయ్యాయి. ఈ ఎలివేటెడ్ కారిడార్ పూర్తయితే హైదరాబాద్ నగరం వరంగల్, బీబీనగర్ ఎయిమ్స్, భువనగిరి, జనగాం ప్రాంతాలతో మెరుగైన రవాణా అనుసంధానం పొందుతుందని మంత్రి తెలిపారు. ప్రాజెక్టులో భాగంగా బీటీ రోడ్ల పునరుద్ధరణ, మరమ్మతు పనులు పూర్తయ్యాయని చెప్పారు.




# బ్రిక్స్ నేతలతో కలిసి మర్రి మొక్క నాటిన మోదీ

## లోతైన వేర్లు.. పెరుగుతున్న బలం..

## ఉమ్మడి భవిష్యత్‌కు ప్రతీక: ప్రధాని

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12 (వాయిస్ టుడే): ఢిల్లీలో బ్రిక్స్ దేశాల నేతలతో కలిసి ప్రధాని నరేంద్ర మోదీ మర్రి మొక్కను నాటారు. బ్రిక్స్ కూటమి స్ఫూర్తికి ఈ మొక్క ప్రతీకగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. "లోతైన వేర్లు, పెరుగుతున్న బలం, ఉమ్మడి భవిష్యత్ కోసం కలిసి ముందుకు సాగడం.. బ్రిక్స్ స్ఫూర్తికి ఈ మొక్క సరైన ప్రతీక" అని మోదీ పేర్కొన్నారు. రానున్న రోజుల్లో భారత్ సహా బ్రిక్స్ దేశాల మధ్య భాగస్వామ్యం మరింత బలపడాలని ఆకాంక్షించారు.

# మాక్ అసెంబ్లీలో బీఆర్‌ఎస్ సెటైర్లు

వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. తమ్మిడిహట్టి ప్రాజెక్టును నిర్మిస్తామని, మేడిగడ్డను రిపేర్ చేయాలని కోరారు. ఇదిలా ఉండగా, అసెంబ్లీ గేటు వద్ద జరిగిన గందరగోళం నేపథ్యంలో బీఆర్‌ఎస్ నేతలపై లైంగిక వేధింపుల కేసులు నమోదు చేయడంపై కేటీఆర్ స్పందించారు. కేసులను న్యాయస్థానాల్లో ఎదుర్కొంటామని తెలిపారు. అదే సమయంలో 2025లో హైదరాబాద్‌లో జరిగిన మిస్ వరల్డ్ పోటీల సందర్భంగా మిస్ ఇంగ్లాండ్ మిల్లా మ్యాగీ చేసిన ఆరోపణలపై ప్రభుత్వం, పోలీసుల చర్యలను ఆయన ప్రశ్నించారు. మిస్ ఇంగ్లాండ్ చేసిన ఆరోపణలపై ప్రభుత్వం సీనియర్ ఐపీఎస్ అధికారి నేతృత్వంలో విచారణకు ఆదేశించిన విషయాన్ని ప్రస్తావిస్తూ, నిందితులపై ఏం చర్యలు తీసుకున్నారని కేటీఆర్ ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ నేతలపై కేసులు నమోదు చేయడం చట్ట దుర్వినియోగమని ఆయన ఆరోపించారు. మాక్ అసెంబ్లీలో మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను సీఎం పాత్రలో కూర్చోబెట్టడంపై కూడా రాజకీయ వర్గాల్లో చర్చ జరిగింది. బీసీ నేతకు నిజమైన అసెంబ్లీలో ప్రతిపక్ష నేత పదవి ఇవ్వకుండా మాక్ అసెంబ్లీలో సీఎం పాత్ర ఇవ్వడంపై ప్రత్యర్థులు విమర్శలు చేయగా, కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని ఎండగట్టేందుకే తలసానికి ఆ పాత్ర ఇచ్చామని బీఆర్‌ఎస్ వర్గాలు సమర్థించుకున్నాయి.

# గణేశ్ ఉత్సవాలపై సీఎం రేవంత్ కీలక ఆదేశాలు



వాటిని పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గణేశ్ ఉత్సవాలకు సంబంధించి గత సంప్రదాయాన్ని పునరుద్ధరించామని, నిర్వాహకుల సమస్యలను తెలుసుకునేందుకే స్వయంగా సమీక్ష నిర్వహిస్తున్నానని చెప్పారు. గణేశ్ మండపాలకు ప్రముఖులను ఆహ్వానించినప్పుడు ఆ వివరాలను సంబంధిత పోలీస్ కమిషనరేట్‌కు ముందుగానే అందించాలని నిర్వాహకులకు సూచించారు. మండపాల వివరాలు ముందుగానే అందితే ట్రాఫిక్, బందోబస్తు ఏర్పాట్లు సులభతరం అవుతాయని పేర్కొన్నారు. తెలంగాణలో గణేశ్ మండపాలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని సీఎం తెలిపారు. మండప నిర్వాహకులు సంబంధిత అధికారులకు దరఖాస్తు చేసుకుని ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని సూచించారు. అభివృద్ధి చేస్తున్న చెరువుల వద్ద బతుకమ్మ ఏర్పాట్ల తరహాలోనే గణేశ్ నిమజ్జనాలకు అవసరమైన సౌకర్యాలను నిర్మాణ దశలోనే కల్పించాలని అధికారులను ఆదేశించారు. నిమజ్జనం సాఫీగా జరిగేందుకు చెరువుల చుట్టూ క్రేన్లు ఏర్పాటు చేయడానికి అనుగుణంగా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు.

# 2034 నాటికి తెలంగాణను ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యం



ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. తాగునీరు, మురుగునీటి శుద్ధి, ప్రజా రవాణా, ట్రాఫిక్, చెత్త నిర్వహణ, వరదల నియంత్రణ, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలను సమన్వయంతో నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నట్లు వివరించారు.

### సమగ్ర మొబిలిటీ ప్లాన్ సిద్ధం

హైదరాబాద్‌ను లిబ్లూ సిటీ, గ్రీన్ సిటీగాలి తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని శ్రీధర్‌బాబు తెలిపారు. నగర రవాణా వ్యవస్థను క్రమబద్ధీకరించేందుకు కాంప్రిహెన్సివ్ మొబిలిటీ ప్లాన్ రూపొందించామని చెప్పారు. మూసీ పునరుజ్జీవనం తొలిదశ పనులకు రూ.7,345.12 కోట్లతో ముందస్తు అనుమతులు మంజూరయ్యాయని, తాగునీటి అవసరాల కోసం 20 టీఎంసీల గోదావరి జలాలను హైదరాబాద్‌కు తరలించేందుకు చర్యలు చేపట్టామని వెల్లడించారు. పాలనా సౌలభ్యం కోసం జీహెచ్‌ఎంసీని మూడు కార్పొరేషన్లుగా విభజించామని, వాటి మధ్య సమన్వయం కోసం సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన ఉన్నతస్థాయి పాలకమండలిని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. శుద్ధి చేసిన మురుగునీటిని చెట్ల పెంపకం, కాలుష్య నియంత్రణకు వినియోగిస్తామని, నగరంలో పచ్చదనాన్ని పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపడతామని చెప్పారు.

### 400 రకాల చిన్న నేరాల డీక్రిమినలైజేషన్

వ్యాపార రంగానికి మరింత ఊతమిచ్చేందుకు లితెలంగాణ ప్రజా విశ్వాసం నిబంధనల సవరణ చట్టంలి బిల్లును తీసుకొచ్చినట్లు శ్రీధర్‌బాబు తెలిపారు. సుమారు 400 రకాల చిన్నపాటి సాంకేతిక నేరాలను నేరపూరిత పరిధి నుంచి తొలగించడం ద్వారా 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' మరింత సులభతరం అవుతుందని చెప్పారు. అనవసర కోర్టు కేసులతో ఇబ్బందులు పడుతున్న చిన్న వ్యాపారులకు ఈ నిర్ణయం ఊరటనిస్తుందని, కొత్త చట్టాలపై కలెక్టర్లు, వ్యాపార వర్గాలకు అవగాహన కల్పిస్తామని మంత్రి వెల్లడించారు.



# మట్టి వినాయకుల పంపిణీలో వడ్డేపల్లి రాజేశ్వరరావు

కూకట్ పల్లి : సెప్టెంబర్ 12(వాయిస్ టుడే): కూకట్‌పల్లి నియోజకవర్గం లోని 6వ ఫేజ్‌లోని సీనియర్ సిటిజన్స్ పార్క్‌లో ఆర్ జి వి వి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మట్టి వినాయకుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై భక్తులకు మట్టి వినాయకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులను ప్రతిష్ఠించాలని పిలుపునిచ్చారు. ఫౌండేషన్ చైర్మన్ ఎన్. రత్న గురు ప్రసాద్ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమాన్ని అభినందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాహకులు, సీనియర్ సిటిజన్స్, స్థానిక ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

# లైంగిక వేధింపుల కేసులో ఢీ-10 విజేత రాజు అరెస్ట్



మియాపూర్, సెప్టెంబర్ 12 (వాయిస్ టుడే): ప్రముఖ డ్యాన్స్ రియాలిటీ షో 'ఢీ-10' విజేత రాజుపై లైంగిక వేధింపుల ఆరోపణలతో మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఓ మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సెప్టెంబర్ 9న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఫిర్యాదులో పేర్కొన్న అంశాలపై విచారణ జరిపిన పోలీసులు కేసు నమోదు చేసిన మూడు రోజుల అనంతరం రాజును అరెస్ట్ చేశారు. అనంతరం అతడిని కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. ఫిర్యాదుదారు చేసిన ఆరోపణలు, ఘటనకు సంబంధించిన పరిస్థితులపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. కేసుతో సంబంధం ఉన్న వ్యక్తుల నుంచి వివరాలు సేకరిస్తూ, ఫిర్యాదులో పేర్కొన్న అంశాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. దర్యాప్తు పూర్తయిన తర్వాత కేసుకు సంబంధించిన మరిన్ని వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు. కాగా, ఈ కేసులోని ఆరోపణలు ప్రస్తుతం దర్యాప్తు మరియు న్యాయ ప్రక్రియలో ఉన్నాయని పోలీసులు పేర్కొన్నారు.

# భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి దుండిగల్ సర్కిల్ బౌరంపేట్

కుత్బుల్లాపూర్ సెప్టెంబర్ 12(వాయిస్ టుడే): బౌరంపేట పెద్ద చెరువు దగ్గర ముమ్మరంగ సాగుతున్న గణేష్ నిమజ్జన ఏర్పాట్లు పరిశీలించిన దుండిగల్ సర్కిల్ గణేష్ ఉత్సవ సమితి కన్వీనర్ పీసరి కృష్ణారెడ్డి. ఈ కార్యక్రమంలో కో కన్వీనర్ ఏ శ్రీనివాస్ యాదవ్, డి ఈ పాపమ్మ, ఏఈ సురేందర్ నాయక్, వర్క్ ఇన్స్పెక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు. భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ఆదేశాల మేరకు దుండిగల్ సర్కిల్ లోని బౌరంపేట పెద్ద చెరువు, దుండిగల్ పెద్ద చెరువు, గాగిలాపూర్ కోతినారి చెరువు, డిపోచంపల్లి కుడిగుంట చెరువు, శంబిపూర్ షాకిన్ చెరువు వద్ద నిమజ్జనానికి సంబంధించి అధికారులతో కలిసి ఏర్పాట్లు పరిశీలించడం జరిగింది. కాంతివంతమైన వెలుతురుతో భారీ స్థాయిలో ఫోకస్ లైటింగ్, బారికేడ్లు,గుంతల రోడ్లు, ఏర్పాటు చేయడం జరిగింది తాగునీరు,బయో టయిలెట్లు త్వరలో ఏర్పాటు చేయనున్నారు.దుండిగల్ పెద్ద చెరువు దగ్గర వినాయకుని ఊరేగింపు తెచ్చిన వాహనాలు చెరువు కట్ట చివరన నాగులూర్ రోడ్డులో యూ మలుపు తీసుకోవడానికి భద్రత కోసం కర్రలతో బారికేడ్లు ఏర్పాటు చేస్తే దుండగులు కర్రలు మొత్తం దొంగిలించడం జరిగింది . వాడు ఎవడైనా సరే ఇలాంటి చర్యలు చేయడం సిగ్గుచేటు కనీస బాధ్యత లేని సమాజం కన్వీనర్ పీసరి కృష్ణారెడ్డి మాట్లాడుతూ దయచేసి హిందూ బంధువులు శ్రీ మహాగణాధిపతి నవరాత్రులు పూజలలో భక్తిశ్రద్ధలతో పాల్గొంటాం మనమే నిర్వహిస్తాం దానితోపాటు ముఖ్యంగా భక్తులందరూ మరియు యువత బాధ్యతతో వ్యవహరిద్దాం,ప్రపంచంలో అన్నింటికన్నా సనాతన హైందవ ధర్మం ఎంతో గొప్పది. ప్రకృతితో పెనవేసుకున్న సనాతన సంస్కృతి సంప్రదాయం కోట్ల మందికి జీవనోపాధి కల్పిస్తూ కోట్ల రూపాయల వ్యాపారం జరుగుతుంది. అందులో భాగంగా దూరం ఉండాల్సినవి ప్రధానంగా ప్లాస్టిక్, మత్తు పదార్థాలు మత్తు పానీయాలు, ఇరుగుపొరుగు వారికి డీజే సౌండ్ పై విషయంలో ఎవరికి అసౌకర్యం కలగకుండా, చూసుకోవాల్సిన బాధ్యత మన అందరిదీ. మరియు స్థానిక మున్సిపల్ అధికారులతో, పోలీసు అధికారులతో విద్యుత్ అధికారులతో సంయమనంతో పరస్పరశీ సహకరించుకుంటూ పని చేద్దాం మనకు కావాల్సిన ఏర్పాట్లు చేయించుకుందాం సనాతన హైందవ ధర్మాన్ని కాపాడుకుందాం జైహింద్ జైశ్రీరామ్ జై బోలో గణేష్ మహారాజ్ కి జై.

# లెనిన్ నగర్‌లో రూ.54 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్



కుత్బుల్లాపూర్ సెప్టెంబర్ 12(వాయిస్ టుడే): కుత్బుల్లాపూర్: రోడా మేస్త్రి నగర్ నగర్ డివిజన్ పరిధిలోని లెనిన్ నగర్‌లో రూ.54 లక్షలతో మంజూరైన అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణ పనులకు కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ.. గత బిఆర్ఎస్ ప్రభుత్వ పదేళ్ల పాలనలో ప్రజల మౌలిక అవసరాలను పట్టించుకోకపోవడంతో పాటు, సరైన మౌలిక వసతులు కల్పించకపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజల మౌలిక అవసరాలకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ నియోజకవర్గవ్యాప్తంగా సుమారు రూ.50 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేపట్టినట్లు తెలిపారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలు నిరుపేదలకు ఎంతో ప్రయోజనం చేకూరుస్తున్నాయని అన్నారు. ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, సన్న బియ్యం పంపిణీ వంటి పథకాల ద్వారా పేద, మధ్యతరగతి కుటుంబాలకు మేలు జరుగుతోందని పేర్కొన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో రోడ్ల నిర్మాణానికి నిధులు విడుదల చేయడంలో సహకరించిన జిల్లా ఇన్చార్జి మంత్రి శ్రీధర్ బాబు కూన శ్రీశైలం గౌడ్ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తామని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి డిసిసి ఉపాధ్యక్షులు కూన శ్రీనివాస్ గౌడ్ పాటు స్థానిక నాయకులు బుచ్చిరెడ్డి, రషీద్ బెగ్, డివిజన్ అధ్యక్షులు మధుసూదన్ మరియు రాజి రెడ్డి, రవీందర్ రెడ్డి, రామ్ నర్సయ్య, సలీం, సాయిలు,రజాక్, నాగరాజ, రవి చారి, ఆది నారాయణ, ఉప్పల రవి, వెంకట్ రాజు తదితరులు పాల్గొన్నారు.



# కొండా విజయ్ కుమార్ జన్మదినం సందర్భంగా మెగా రక్తదాన శిబిరం

హఫీజ్‌పేట్, సెప్టెంబర్ 12 (వాయిస్ టుడే): హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండా విజయ్ కుమార్ జన్మదినాన్ని పురస్కరించుకుని హఫీజ్‌పేట్ డివిజన్‌లోని హుడా కాలనీలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీతో పాటు మాజీ కార్పొరేటర్లు హమీద్ పటేల్, ఉప్పలపాటి శ్రీకాంత్, సీనియర్ నాయకుడు రఘునాథ్ రెడ్డి తదితరులు కొండా విజయ్ కుమార్‌ను శాలువాతో సత్కరించి, కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. రక్తదాన శిబిరంలో పాల్గొన్న దాతలకు గాంధీ ప్రశంసా పత్రాలను అందజేశారు.

ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ కొండా విజయ్ కుమార్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సామాజిక బాధ్యతతో పలు సంక్షేమ, సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న కొండా విజయ్ కుమార్ సేవలను ఆయన అభినందించారు. సమాజానికి ఆయన చేస్తున్న సేవలు అభినందనీయమని అన్నారు. కొండా విజయ్ కుమార్ జన్మదినాన్ని పురస్కరించుకుని మెగా రక్తదాన శిబిరంతో పాటు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని గాంధీ అన్నారు. శిబిరంలో సుమారు 115 మంది రక్తదానం చేశారని, రక్తదానం చేసేందుకు ముందుకు వచ్చిన ప్రతి ఒక్కరినీ ఆయన అభినందించారు. "రక్తదానం అన్నింటికంటే గొప్ప దానం. రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలి" అని గాంధీ అన్నారు. తలసేమియా బాధితులు, గర్భిణులు, ప్రమాద బాధితులు సహా ఎంతోమందికి ప్రతిరోజూ రక్తం అవసరమవుతుందని, అవసరమైన సమయంలో రక్తం అందుబాటులో లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ప్రతి చుక్క రక్తం విలువైనదేనని, ఎన్నో వస్తువులను తిరిగి తయారు చేయవచ్చని, కానీ రక్తాన్ని మాత్రం ఒకరు దానం చేసినప్పుడే మరొకరికి అందించగలమని గాంధీ పేర్కొన్నారు. రక్తదానంపై ఉన్న అపోహలను ప్రజలు వీడి, మరింత మంది రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు, స్థానికులు పాల్గొన్నారు.





# ఉప్పల్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ

ఉప్పల్ ( వాయిస్ టుడే ప్రతినిధి):- పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నివారణ లక్ష్యంగా ఉప్పల్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పర్యావరణహితమైన మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల నిమజ్జనం వల్ల నీటి వనరులు కలుషితమయ్యే అవకాశం ఉన్నందున మట్టి విగ్రహాలను వినియోగించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడవచ్చన్నారు. సంప్రదాయాన్ని కాపాడుతూ ప్రకృతిని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలను ప్రోత్సహించాలని కోరారు. యువత, మహిళలు, గణేష్ ఉత్సవ కమిటీలు, కాలనీ సంక్షేమ సంఘాలు పర్యావరణహిత గణేష్ ఉత్సవాల్లో భాగస్వాములు కావాలని సూచించారు.ఈకార్యక్రమంలో టీయూడబ్ల్యూజే మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకటరామిరెడ్డి, ఉప్పల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వి.తిరుపతిరెడ్డి, ప్రధాన కార్యదర్శి గ్యారంపల్లి శివాజీ, వర్కింగ్ ప్రెసిడెంట్ పి.సాగర్, ఉపాధ్యక్షులు ఏవి.శ్రీధర్‌రావు, కే.నరోత్తమరెడ్డి, కోశాధికారి గుత్తి శేఖర్ జాయింట్ సెక్రటరీ డి.రాజు, సీనియర్ జర్నలిస్టులు మండవ శ్రీశైలం,కొలనుపాక చంద్రమౌళి,పి.మహేందర్‌రెడ్డి,తదితర జర్నలిస్టులు,గణేష్ ఉత్సవ నిర్వాహకులు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కాలనీ ప్రజలు,భక్తులు పాల్గొన్నారు.



# కొలన్ సులోచన మృతికి డా. ఎస్.మల్ల రెడ్డి సంతాపం

కుత్బుల్లాపూర్ సెప్టెంబర్ 12(వాయిస్ టుడే): కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి లిలికొలన్ హన్మంత్ రెడ్డి మాతృమూర్తి, కీ.శే. కొలన్ సులోచన ఈ నెల 9 వ తేదీన అకాల మరణం చెందడంతో, రోజు ఆయన నివాసానికి పలువురు ప్రముఖులు విచ్చేసి సంతాపం తెలిపారు ఈ సందర్భంగా లిలిమాజీ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు డా. ఎస్. మల్ల రెడ్డి రెడ్డి కొలన్ హన్మంత్ రెడ్డి పరామర్శించి, సులోచనమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు సులోచన మృతి పట్ల వారు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు ఈ కార్యక్రమం లో సీనియర్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



# హైదరాబాద్‌లో కవాడిగూడలో గోల్డ్ స్టార్ అసోసియేషన్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో గణేష్ ఆగమన వేడుకలు

ఘనంగా నిర్వహించారు. భక్తి శ్రద్ధల మధ్య గణనాథుడికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా 50 మంది మహిళలు దీప హారతులతో స్వామివారికి ప్రత్యేకంగా స్వాగతం పలకడం వేడుకకు మరింత ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దీపాల వెలుగులతో పరిసర ప్రాంతమంతా భక్తిమయ వాతావరణంతో నిండిపోయింది. మహిళలు సంప్రదాయబద్ధంగా దీప హారతులు ఇస్తూ గణనాథుడిని ఆహ్వానించారు. భక్తుల జయజయధ్వానాలు, సందడి మధ్య గణేష్ ఆగమనం ఘనంగా జరిగింది. ఈ వేడుకలో స్థానికులు, యువత, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణపతికి స్వాగతం పలికారు. 50 మంది మహిళలు ఒకేసారి దీప హారతులు ఇవ్వడం అందరి దృష్టిని ఆకర్షించింది. సంప్రదాయం, భక్తి, సంబరాలు కలిసిన ఈ గణేష్ ఆగమన వేడుక కవాడిగూడలో ప్రత్యేకంగా నిలిచింది.



# చింతల్‌లో ఘనంగా గణేష్ ఆగమన్.. ముఖ్య అతిథిగా నర్సారెడ్డి భూపతిరెడ్డి

కుత్బుల్లాపూర్ సెప్టెంబర్ 12(వాయిస్ టుడే): మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు శ్రీకాంత్ గౌడ్ మరియు వారి మిత్రబృందం ఏర్పాటు చేసిన చింతల్ గణేష్ ఆగమన్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఖాజా భాయ్, జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ కావలి చంద్రయ్య, రంగారెడ్డి నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జలీల్ ఖాన్, గణేష్ నగర్ డివిజన్ అధ్యక్షులు ఇరుగు రాధాకృష్ణ, దుండిగల్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జక్కుల మల్లేష్ యాదవ్, పద్మనగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గడ్డం రాజేందర్ రెడ్డి, నిజాంపేట్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కోటపాటి మురళి, బండారి లేఔట్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వాసు వరగాని, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి గడ్డమీది భరత్ గౌడ్,కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు బొట్ల విజయ్ కుమార్, యువజన కాంగ్రెస్ నాయకులు మాదిరెడ్డి అరుణ్ రెడ్డి, బత్తుల చిరంజీవి మరియు స్థానిక నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# మట్టి వినాయకులను పంపిణీ చేసిన సొంటిరెడ్డి పున్నారెడ్డి

కుత్బుల్లాపూర్ సెప్టెంబర్ 12(వాయిస్ టుడే): పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తూ, శ్రీ ఎస్ పి ఆర్ గ్లోబల్ స్కూల్ సిబ్బందికి మట్టి వినాయకుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది.రసాయనాలు, ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలకు బదులుగా మట్టి వినాయకులను పూజించి మన ప్రకృతిని, నీటి వనరులను కాపాడుకుందాం ఈ కార్యక్రమంలో శ్రీ ఎస్ పి ఆర్ గ్లోబల్ స్కూల్ చైర్మన్ సొంటిరెడ్డి పున్నారెడ్డి పాల్గొని సిబ్బందికి మట్టి వినాయకులను అందజేశారు.

VOICE OF PRAJALU వాయిస్ ఆఫ్ ప్రజలు
ప్రజల గొంతుక - నిజం కోసం.. తెలుగు దినపత్రిక
హైదరాబాద్
ఆదివారం 13 సెప్టెంబరు 2026

# 800 గ్రాముల పసికందుకు పునర్జన్మ 1కిలో 600 గ్రాములతో తల్లి ఒడికి!

## హన్మకొండలోని తనయ చిల్డ్రన్ హాస్పిటల్ అద్భుత వైద్యం

## హాస్పిటల్ యాజమాన్యానికి శిశువు తల్లిదండ్రుల కృతజ్ఞతలు



హనుమకొండ, సెప్టెంబరు 12(వాయిస్ టుడే): వైద్యాన్ని వ్యాపారంగా కాకుండా సేవగా అందిస్తూ అందరికీ అందుబాటులో వైద్యం అందిస్తోంది తనయ చిల్డ్రన్ హాస్పిటల్. అతి తక్కువ బరువుతో పుట్టిన పసికందును ప్రాణాపాయం నుండి కాపాడి, ఆరోగ్యంగా తీర్చిదిద్దడంలో తనయ వైద్య బృందం మరో అద్భుతాన్ని సృష్టించింది. హనుమకొండ సుబేదారి లోని తనయ చిల్డ్రన్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ అర్జున్ రెడ్డి ఆధ్వర్యంలో కేవలం 800 గ్రాముల బరువుతో పుట్టిన నెలలు నిండని శిశువును తనయ చిల్డ్రన్ హాస్పిటల్ లో చేర్పించగా అక్కడి పిల్లల వైద్య నిపుణులైన వైద్యులు డాక్టర్ రసజ్ఞ రెడ్డి, డాక్టర్ హర్షవర్ధన్ ప్రత్యేక పర్యవేక్షణలో అధునాతన చికిత్స అందించారు. నిరంతర కృషి, అధునాతన వైద్య సేవల ఫలితంగా ఆ పసికందు బరువు 1 కిలో600 గ్రాములకు పెరిగి సంపూర్ణ ఆరోగ్యంతో తల్లిదండ్రుల చెంతకు చేరింది.

### అతి తక్కువ ఖర్చుతో మెరుగైన వైద్యం..

ఖరీదైన కార్పొరేట్ హాస్పిటల్స్ లో లక్షల రూపాయలు ఖర్చయ్యే ఇలాంటి చికిత్సను తనయ చిల్డ్రన్ హాస్పిటల్ లో అతి తక్కువ ఖర్చుతో అందించడం విశేషం. హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ అర్జున్ రెడ్డి లక్ష్యం ప్రకారం పేద, మధ్యతరగతి కుటుంబాలకు అందుబాటు ధరలోనే కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తుండటంతో తనయ అంటేనే అందరికీ వైద్యం అనే నమ్మకం ప్రజల్లో బలంగా నాటుకుపోయింది. ఈ సందర్భంగా పసికందు తల్లిదండ్రులు తనయ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ అర్జున్ రెడ్డి, వైద్యులు డాక్టర్ రసజ్ఞ రెడ్డి, డాక్టర్ హర్షవర్ధన్ లకు కృతజ్ఞతలు తెలిపారు. "బిడ్డ చాలా తక్కువ బరువుతో పుట్టడంతో మేము చాలా భయపడ్డాము. బతుకుతుందో లేదో అనే ఆందోళనలో ఉన్న సమయంలో తనయ హాస్పిటల్ లో మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ అర్జున్ రెడ్డి ఆధ్వర్యంలో డాక్టర్ రసజ్ఞ రెడ్డి, డాక్టర్ హర్షవర్ధన్ మాకు ధైర్యం చెప్పి అత్యంత జాగ్రత్తగా చూసుకున్నారని, అతి తక్కువ ఖర్చుతోనే మా బిడ్డకు ప్రాణం పోశారని శిశువు తల్లి అన్నారు. తనయ ఆసుపత్రి వారికి జీవితాంతం రుణపడి ఉంటాము" అని హాస్పిటల్ యాజమాన్యానికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.



# సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో రూ.3.32 లక్షల సీఎంఆర్ఎఫ్ సాయం

## బండి రమేష్ చొరవతో ఆరుగురు లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ

కూకట్‌పల్లి, సెప్టెంబర్ 12(వాయిస్ టుడే): కూకట్‌పల్లి నియోజకవర్గం లో అనారోగ్యంతో బాధపడుతూ వైద్య ఖర్చులు భరించలేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆరుగురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బండి రమేష్ చొరవతో సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.3,32,500 ఆర్థిక సాయం మంజూరైంది. శనివారం కూకట్‌పల్లిలోని శ్రీ హేమదుర్గ భవన్‌లో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బండి రమేష్ లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. పొట్టేటి గౌతమికి రూ.60 వేలు, గౌసియా బేగంకు రూ.50 వేలు, తమ్మిరి కృష్ణవేణికి రూ.60 వేలు, దేవుళ్ల నీలం రాజుకు రూ.60 వేలు, కడిపప్పుల్ ఫ్రాన్సిస్‌కు రూ.42,500, మండల చంద్రకళకు రూ.60 వేల చొప్పున చెక్కులు అందించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు తమకు ఆర్థిక సహాయం అందేలా కృషి చేసిన సీఎం రేవంత్ రెడ్డి, బండి రమేష్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో లక్ష్మయ్య, నాగార్జున, శివ చౌదరి, నలినీకాంత్, వరుణ్, జహంగీర్, సజ్జన్, సంధ్య, జోజమ్మ, కల్పన, రజిని, మారుతి తదితరులు పాల్గొన్నారు.



# వినాయక చవితి వేళ హైదర్‌నగర్‌లో బ్యాడ్మింటన్ పోటీలు

## హోరాహోరీ పోరులో విజేతగా నిలిచిన చందు నరహరి

హైదర్‌నగర్, సెప్టెంబర్ 12(వాయిస్ టుడే): హైదర్‌నగర్ డివిజన్‌లోని ఎస్ఎల్‌వీ ప్రో బ్యాడ్మింటన్ అకాడమీలో వినాయక చవితి సందర్భంగా శనివారం బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌ను ఉత్సాహంగా నిర్వహించారు. స్థానిక క్రీడాకారులు, అకాడమీ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్న ఈ పోటీలు పలు విభాగాల్లో హోరాహోరీగా సాగాయి. ముఖ్యంగా ఫైనల్ మ్యాచ్ ఆఖరి పాయింట్ వరకు ఉత్కంఠభరితంగా సాగింది. అద్భుతమైన ఆటతీరుతో చందు నరహరి విజేతగా నిలిచారు. నిర్వాహకులు ఆయనకు ప్రథమ బహుమతితో పాటు జ్ఞాపికను అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు స్నేహభావం, ఐక్యతను పెంపొందిస్తాయని తెలిపారు. పండుగల సందర్భంగా ఇలాంటి క్రీడా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా సమాజంలో సోదరభావం మరింత బలపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో క్రీడా ప్రోత్సాహకులు విష్ణు యాదవ్, డాక్టర్ సురేందర్, అజయ్ చింతల, రామ్, నవీన్, ప్రవీణ్, ఆర్కే, సుధాకర్, సాయి, నరేష్, రమేష్, నాగరాజు యాదవ్, సురేంద్ర, దరియా, కిషోర్, బ్రహ్మ రెడ్డి తదితరులు పాల్గొని విజేత చందు నరహరికి శుభాకాంక్షలు తెలిపారు.




# డిగ్రీ 'దండగ కాదు.. పండగ'

## ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య వి. బాలకిష్టారెడ్డి

## అవంతి కళాశాల పట్టభద్రుల దినోత్సవ వేడుకలు ఘనం




హైదరాబాద్, సెప్టెంబర్ 12: దేశ జనాభాలో దాదాపు 50 శాతం మంది 26--27 ఏళ్ల లోపు యువతే ఉన్నారని, వారికి నాణ్యమైన విద్యతో పాటు సరైన ఉపాధి మార్గదర్శకత్వం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య వి. బాలకిష్టారెడ్డి పేర్కొన్నారు. కాచిగూడలోని మున్నూరుకాపు భవన్, మ్యాడం అంజయ్య వేదికలో శనివారం నిర్వహించిన అవంతి కళాశాల పట్టభద్రుల దినోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అవంతి విద్యా సంస్థల చైర్మన్, మాజీ మంత్రి ఎం. శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆచార్య బాలకిష్టారెడ్డి మాట్లాడుతూ, యువత విద్యను విస్మరిస్తే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఎదురవుతాయని, అందుకే రాష్ట్రంలో విద్యా వ్యవస్థను పటిష్టం చేస్తూ గ్రాడ్యుయేషన్ స్థాయిలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్నామని తెలిపారు. 'డిగ్రీ దండగ కాదు.. పండగ' అనే నినాదాన్ని నిజం చేస్తూ, మూడేళ్లు లేదా నాలుగేళ్ల చదువు పూర్తయిన వెంటనే విద్యార్థులకు ఉద్యోగావకాశాలు లభించేలా గత ఏడాది కాలంగా కసరత్తు చేసి సరికొత్త పాఠ్యప్రణాళికను సిద్ధం చేసినట్లు వెల్లడించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో వినూత్న కోర్సులను అందుబాటులోకి తెస్తున్నామన్నారు.

రక్షణ రంగం, విమానయానం, విమానాశ్రయాల నిర్వహణ, సముద్ర తీర భద్రత, అంతర్జాల రక్షణ, పర్యావరణ అధ్యయనం, రక్షణ అధ్యయనం వంటి మార్కెట్ ఆధారిత నూతన కోర్సులను ప్రవేశపెడుతున్నామని చెప్పారు. ఇప్పటికే కొన్ని కళాశాలల్లో భద్రతా అధ్యయనాలు ప్రారంభించామని, రానున్న విద్యా సంవత్సరం నుంచి విమానయాన, సముద్ర భద్రత, రక్షణ రంగాలకు అవసరమైన నైపుణ్య కోర్సులు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తాయని వివరించారు. పరిశ్రమల అవసరాలకు తగ్గట్టు మానవ వనరులను తీర్చిదిద్దడంలో తెలంగాణ దేశానికే దిక్సూచిగా నిలుస్తుందని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయ డైరెక్టర్ ఆచార్య ఎన్. వెంకటరమణ, అవంతి విద్యా సంస్థల ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎం. ప్రియాంక, శ్రవణ్ కుమార్, ఎం.వి.ఎస్.ఎస్. నందీశ్, డాక్టర్ వై. జయప్రద, డాక్టర్ శేష తలసాయి, డాక్టర్ ఉమాపతి రెడ్డి, ఆచార్య ఎస్. అప్పారావు, డాక్టర్ బైస స్వాతి, డాక్టర్ బి. రాజ్ కమల్, డాక్టర్ ఎస్. నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# బీమా రంగానికి సేవాభావం, మానవతా దృక్పథమే కీలకం

## ఐఐఆర్ఎం స్నాతకోత్సవంలో ఐఆర్‌డీఏఐ చైర్మన్ అజయ్ సేథ్ పిలుపు




హైదరాబాద్, సెప్టెంబర్ 12: బీమా రంగంలో పనిచేసే నిపుణులకు వృత్తిపరమైన సేవాభావం, మానవతా దృక్పథం (ఎంపతీ) అత్యంత కీలకమని భారత బీమా నియంత్రణ, అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఐఆర్‌డీఏఐ) చైర్మన్ అజయ్ సేథ్ స్పష్టం చేశారు. ఐఆర్‌డీఏఐ, తెలంగాణ ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యంతో నడుస్తున్న 'ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్సూరెన్స్ అండ్ రిస్క్ మేనేజ్‌మెంట్' (ఐఐఆర్ఎం) 2024--26 పీజీడీఎం బ్యాచ్ స్నాతకోత్సవ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అజయ్ సేథ్ పట్టభద్రులకు డిగ్రీలు ప్రదానం చేసి మాట్లాడారు. దేశంలో వేగంగా విస్తరిస్తున్న బీమా, రిస్క్ మేనేజ్మెంట్ రంగాల్లో నైపుణ్యం కలిగిన యువతకు అపార అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతికత, ఆవిష్కరణలు, నిరంతర అభ్యాసం, వృత్తిపరమైన నిజాయితీ యువత విజయానికి బాటలు వేస్తాయన్నారు. వికసిత భారత్ లక్ష్యాన్ని చేరాలన్నా, 'అందరికీ బీమా' సాకారం కావాలన్నా సేవాభావంతో కూడిన సేవలే కీలకమని ఆయన ఉద్ఘాటించారు. గౌరవ అతిథిగా విచ్చేసిన ట్రిపుల్ ఐటీ హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ సందీప్ కుమార్ శుక్లా మాట్లాడుతూ.. సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకుంటూనే, మానవీయ విచక్షణను విస్మరించవద్దని విద్యార్థులకు సూచించారు. నిరంతర నైపుణ్య శిక్షణ, అంతర్-విభాగ అధ్యయనం ద్వారా మాత్రమే పోటీ ప్రపంచంలో రాణించగలరని చెప్పారు. ఈ వేడుకలో వివిధ కోర్సుల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో ఐఆర్‌డీఏఐ ఉన్నతాధికారులు, బీమా రంగ ప్రముఖులు, ఐఐఆర్ఎం అధ్యాపక బృందం, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# ప్రముఖ బ్రాండెడ్ వస్త్రాలు, పాదరక్షలపై భారీ డిస్కౌంట్ సేల్

## 81 శాతం వరకు ప్రత్యేక రాయితీ.. ఉచిత ప్రవేశం

హైదరాబాద్, సెప్టెంబర్ 12: వినియోగదారుల కోసం ప్రముఖ అంతర్జాతీయ, జాతీయ బ్రాండెడ్ రెడీమేడ్ దుస్తులు, పాదరక్షలపై ఫ్యాక్టరీ ధరలకే ప్రత్యేక భారీ డిస్కౌంట్ సేల్ నారాయణగూడ లోని వైఎంసిఏ లో ప్రారంభమైంది. నేరుగా కంపెనీల నుంచే తెప్పించిన నాణ్యమైన ఉత్పత్తులపై ఏకంగా 81 శాతం వరకు భారీ తగ్గింపును అందిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సేల్‌లో పురుషులు, మహిళలు, పిల్లల కోసం లేటెస్ట్ ఫ్యాషన్ కలెక్షన్స్ అందుబాటులో ఉన్నాయి. బ్రాండెడ్ జీన్స్, చినోస్, ట్రౌజర్స్, కార్గో ప్యాంట్లు, వంద శాతం కాటన్ షర్టులు, టీ-షర్టులు, జాకెట్లు, బెర్ముడాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. మహిళల కోసం ప్యూర్ కాటన్ కుర్తీలు, టాప్స్, ప్లాజోలు, జీన్స్ ప్యాంట్లతో పాటు మరెన్నో వెరైటీలు కొలువుదీరాయి. నైకీ, అడిడాస్, ప్యూమా, రీబాక్, క్రోక్స్, జారా, టామీ హిల్‌ఫిగర్, లెవీస్, రేమండ్, పార్క్ అవెన్యూ, కాల్విన్ క్లీన్, అండర్ ఆర్మర్, జాకీ, హెచ్‌ఆర్ఎక్స్, రేర్ ర్యాబిట్ వంటి ప్రముఖ బ్రాండ్ల పాదరక్షలు, వస్త్రాలు రాయితీ ధరలకే లభించనున్నాయి. ప్రదర్శన ప్రాంగణంలోకి ప్రవేశం పూర్తిగా ఉచితమని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# హిందీ జాతీయ భాష అని, దానిని గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత

## - టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్

## ఘనంగా జాతీయ హిందీ దివస్ వేడుకలు



హైదరాబాద్, సెప్టెంబర్ 12: హిందీ జాతీయ భాష అని, దానిని గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. సెక్యులర్ దేశమైన భారత్‌లో అన్ని భాషలు, ప్రాంతాలు, కులాలు, మతాలకు సమాన గౌరవం ఉంటుందని పేర్కొన్నారు. తెలంగాణలో తెలుగుతో పాటు హిందీ, ఉర్దూ భాషలు కూడా విస్తృతంగా వాడుకలో ఉన్నాయని తెలిపారు. తెలంగాణ ప్రదేశ్ లింగ్విస్టిక్ మైనారిటీ సెల్, హైదరాబాద్ హిందీ జర్నలిస్ట్స్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన జాతీయ హిందీ దివస్ వేడుకలకు మహేష్‌కుమార్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇటీవల 'మార్వాడీ గో బ్యాక్' ఉద్యమం జరగడం బాధాకరమన్నారు. ప్రజాస్వామ్య దేశంలో ఒక వర్గాన్ని రాష్ట్రం నుంచి వెళ్లగొట్టాలని కోరడం సరికాదని స్పష్టం చేశారు. మార్వాడీలు కూడా తెలంగాణలో అంతర్భాగమేనని పేర్కొన్నారు. ఇటీవల హిందీ చదివే వారి సంఖ్య తగ్గిపోతుండటం ఆందోళన కలిగించే విషయమన్నారు.

హిందీ భాష ప్రచారంతో పాటు, దాన్ని ప్రజలకు మరింత చేరువ చేయడంలో తెలంగాణ ప్రదేశ్ లింగ్విస్టిక్ మైనారిటీ సెల్ చొరవ తీసుకోవాలని ఆకాంక్షించారు. హిందీ భాష ప్రాధాన్యాన్ని ప్రజలకు వివరించడంతో పాటు, భాషల మధ్య సోదరభావాన్ని పెంపొందించేందుకు కృషి చేయాలని సూచించారు. ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్ మాట్లాడుతూ కొన్నివిచ్ఛినకార శక్తులు మాటలు, కులాలు, భాష ప్రజల మధ్య చిచ్చుపెడుతున్నాయని వారితో అప్రమత్తంగా ఉండాలని కోరారు. హిందీ భాష దేశ ప్రజలందరినీ కలుపుతుందని, దీనిని పరిసరక్షించుకోవలసిన ఆవాసముందని అన్నారు. తెలంగాణ ప్రదేశ్ లింగ్విస్టిక్ మైనారిటీ సెల్ చైర్మన్ రాజేష్ అగర్వాల్ మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో మరియు తెలంగాణ రాష్ట్రంలో హిందీ భాష పరిరక్షణకు కాంగ్రెస్ ప్రభుత్వాలే కృషి చేశాయని గుర్తు చేసారు. వేగంగా మారుతున్న డిజిటల్ ప్రపంచంలో, ప్రపంచ వ్యాపారం మరియు మీడియాలో ఆంగ్లం తరచుగా ఆధిపత్యం చెలాయిస్తున్న తరుణంలో, హిందీ భాషను పరిరక్షించడం మరియు ప్రోత్సహించడం వంటివి ప్రభుత్వాలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ సలహాదారు వి. హనుమంత్ రావు, రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఏం. కూడానా రెడ్డి, తెలంగాణ యూనియన్ అఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ రాష్ట్ర అధ్యక్షులు ఖాజా విరహత్ అలీ, తెలంగాణ ప్రదేశ్ లింగ్విస్టిక్ మైనారిటీ సెల్ నేతలు రాజేష్ గోయల్, ప్రకాష్ రతి, ప్రదీప్ సూరన, ప్రకాష్ జైన్, హైదరాబాద్ హిందీ జర్నలిస్ట్స్ సొసైటీ అధ్యక్షులు అజయ్ కుమార్ శుక్ల, ప్రధాన కార్యదర్శి ఏం.ఏ. సర్వర్, కార్యదర్శి కన్నయ్య సింగ్, కోశాధికారి రమేష్, కార్యవర్గ సభ్యులు పి.హరికృష్ణ, ఎండి. ముజీబ్, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హిందీ భాష పరిరక్షణకు కృషి చేసిన ప్రముఖులు ఋషభ దేవ్ శర్మ కు వినయ్ వీర్ పురస్కారం, దేవ్ కుమార్ పుఖ్రాజ్ కు సదాశివ శర్మ పురస్కారం, మనోహర్ కోశాందర్ కు విద్యారణ్య పురస్కారాన్ని నిర్వాహకులు అందజేశారు.






# కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

## డివిజన్ల వారీగా కార్యకర్తల సమావేశాలు నిర్వహించాలి

## ఆర్.వి. మహేందర్ కుమార్

హైదరాబాద్, సెప్టెంబర్ 12(వాయిస్ టుడే): గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి ఆర్.వి. మహేందర్ కుమార్ ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో విఫలమైందని ఆరోపించారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు పార్టీ శ్రేణులు సమష్టిగా పనిచేయాలని సూచించారు. నియోజకవర్గంలోని ప్రతి డివిజన్‌లో వారం రోజులకోసారి కార్యకర్తల సమావేశాలు నిర్వహించి, ప్రజా సమస్యలను తెలుసుకోవడంతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని ఆర్.వి. మహేందర్ కుమార్ పిలుపునిచ్చారు. పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలు చురుకుగా పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో శీలం సరస్వతి ముదిరాజ్, ఎస్. నాగమణి, జి. ఉమారాణి, ఎ. సంగీత, శ్రీలత, పి. మీనా, కళ్యాణి, ఉజ్వల, కళావతి, రేణుక తదితరులు పాల్గొన్నారు.



# మట్టి వినాయకుల పంపిణీలో వడ్డేపల్లి రాజేశ్వరరావు

కూకట్‌పల్లి, సెప్టెంబర్ 12(వాయిస్ టుడే): కూకట్‌పల్లి నియోజకవర్గం లోని 6వ ఫేజ్‌లోని సీనియర్ సిటిజన్స్ పార్క్‌లో ఆర్ జి వి వి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మట్టి వినాయకుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై భక్తులకు మట్టి వినాయకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులను ప్రతిష్ఠించాలని పిలుపునిచ్చారు. ఫౌండేషన్ చైర్మన్ ఎన్. రత్న గురు ప్రసాద్ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమాన్ని అభినందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాహకులు, సీనియర్ సిటిజన్స్, స్థానిక ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

# తార్నాకలో కొనసాగుతున్న 'సేవా-25' కార్యక్రమాలు

**మట్టి వినాయక విగ్రహాల పంపిణీ**

**అన్నదానం, మండప సేవ, ప్రజా అవగాహన కార్యక్రమాలు**

**మోదీ 25 ఏళ్ల ప్రజాసేవ స్ఫూర్తితో 25 సేవా కార్యక్రమాలకు ప్రణాళిక**



సికింద్రాబాద్, సెప్టెంబర్ 12 (వాయిస్ టుడే ప్రతినిధి): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 సంవత్సరాల నిరంతర ప్రజాసేవకు స్ఫూర్తిగా సికింద్రాబాద్ మహంకాళి జిల్లా బీజేపీ ఇంటలెక్చువల్ సెల్ ఇంచార్జ్ శ్రీరామ్ వెంకటేష్ ఆధ్వర్యంలో తార్నాకలో చేపట్టిన 'తార్నాక సేవా-25' కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. అందులో భాగంగా శనివారం తార్నాక డివిజన్ లో అన్నదానం, మట్టి వినాయక విగ్రహాల పంపిణీ, వినాయక మండపాలకు సహకారం, ప్రజా అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా స్ట్రీట్ నంబర్ 3లో మట్టి వినాయక విగ్రహాలను స్థానికులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీ రామ్ వెంకటేష్ మాట్లాడుతూ.. నరేంద్రమోదీ 25 ఏళ్లలో ఒక్కరోజు సెలవు తీసుకోకుండా ప్రజల కోసం పని చేస్తూ నేడు గ్లోబల్ లీడర్ గా ఎదిగారన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ ప్రజా జీవితంలో 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా 25 సేవా కార్యక్రమాలను చేయడం జరుగుతుందన్నారు. అందులో భాగంగా నేడు అయిదు కార్యక్రమాలను చేశామన్నారు. మండప సేవ, యువతకు అవగాహన కార్యక్రమాలు, అన్నదాన కార్యక్రమాలు, మట్టి గణపతుల పంపిణీ కార్యక్రమం ఇలా వివిధ రకాల కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని తెలిపారు. యువతకు సామాజిక సేవ మీద అవగాహన కల్పించడం కోసం మరిన్ని కార్యక్రమాలు చేయనున్నట్లు తెలిపారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు కుమారుడు అవనీష్ మాట్లాడుతూ.. సేవ అనేది ఒకరోజు కార్యక్రమం కాదని, నిరంతరం కొనసాగాల్సిన బాధ్యత అన్నారు. తార్నాక డివిజన్ అధ్యక్షుడు కంటే కరుణాకర్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజాసేవ అందరికీ స్ఫూర్తిదాయకమని, అదే స్ఫూర్తితో తార్నాకలో సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని అన్నారు. కార్యక్రమాల్లో అడ్వకేట్ శ్రీనివాస్, సుబ్బారావు, కృష్ణ గౌడ్, దేవ, రాధాకృష్ణ, మోహన్, పవన్ తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు, యువత, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్న అమృతకు ఆపన్నహస్తం కావాలి

**అయ్యా.. మా బిడ్డ ప్రాణాలు నిలబెట్టండి**

**పదిహేనేళ్ల బాలిక చికిత్సకు రూ.30 లక్షలు అవసరం**




సికింద్రాబాద్, సెప్టెంబర్ 12 (వాయిస్ టుడే ప్రతినిధి): బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్న తమ 15 ఏళ్ల కుమార్తెకు మెరుగైన వైద్యం అందించి ప్రాణాలు కాపాడాలని తల్లిదండ్రులు దాతలను వేడుకుంటున్నారు. తుకారాంగేట్ సమీపంలోని గౌతమ్‌నగర్‌కు చెందిన అనిల్, అంజలి దంపతుల కుమార్తె అమృత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతోంది. తల్లిదండ్రుల వివరాల ప్రకారం.. సుమారు నాలుగు నెలల క్రితం అమృతకు తరచూ తీవ్రమైన తలనొప్పి రావడంతో ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం ఆమె మెదడులో కణతి (బ్రెయిన్ ట్యూమర్) ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. ప్రస్తుతం అమృతకు శస్త్రచికిత్స అత్యవసరమని, చెన్నైలోని అపోలో ఆస్పత్రిలో చికిత్స చేయించాల్సి ఉంటుందని వైద్యులు సూచించినట్లు తల్లిదండ్రులు తెలిపారు. శస్త్రచికిత్స, తదుపరి వైద్య చికిత్సకు సుమారు రూ.30 లక్షలు ఖర్చవుతుందని వైద్యులు చెప్పడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. భవన నిర్మాణ మేస్త్రీగా పనిచేస్తున్న తండ్రి అనిల్‌కు ఇంత భారీ మొత్తాన్ని భరించే ఆర్థిక స్థోమత లేకపోవడంతో దాతల సహాయం కోసం ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే అమృతకు ప్రతి నెలా మందులు, ఇతర వైద్య ఖర్చుల కోసం పెద్ద మొత్తంలో డబ్బు వెచ్చిస్తున్నామని తల్లిదండ్రులు తెలిపారు. తమ కుమార్తెకు అత్యవసరంగా శస్త్రచికిత్స చేయించాల్సి ఉన్నందున దాతలు మానవతా దృక్పథంతో ముందుకొచ్చి ఆర్థిక సహాయం అందించాలని వారు విజ్ఞప్తి చేశారు.

**సహాయం చేయదలచిన దాతలు:**

**ఖాతాదారు పేరు: అంజలి**

అకౌంట్ నంబర్: 110219877070
IFSC: CNRB0008686
బ్యాంక్: కెనరా బ్యాంక్, గౌతమ్‌నగర్ బ్రాంచ్
PhonePe: 9701866581 (అంజలి)
మరిన్ని వివరాలకు: 9553404555 (అనిల్)

అమృత చికిత్స కోసం తమకు తోచినంత సాయం అందించి చిన్నారి ప్రాణాలను కాపాడేందుకు సహకరించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.



# క్రమశిక్షణ.. దేశభక్తి పెంపొందించడమే లక్ష్యం

**వరంగల్ మామునూరులో సీఏటీసీ-6 ఎన్‌సీసీ శిక్షణ శిబిరం**

వరంగల్ ( వాయిస్ టుడే ) సెప్టెంబర్ 12 : ఎన్‌సీసీ క్యాడెట్లలో క్రమశిక్షణ, దేశభక్తి, జాతీయ సమైక్యతతో పాటు నాయకత్వ లక్షణాలను పెంపొందించి, బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దడమే శిక్షణ శిబిరాల ప్రధాన ఉద్దేశమని 11వ బెటాలియన్ ఎన్‌సీసీ ఖమ్మం కమాండింగ్ ఆఫీసర్ కే.ఎస్. బింద్ర తెలిపారు. 11వ బెటాలియన్ తెలంగాణ ఎన్‌సీసీ ఆధ్వర్యంలో వరంగల్ మామునూరు కేంద్రంగా సెప్టెంబర్ 12 నుంచి 18 వరకు సీఏటీసీ--6 ఎన్‌సీసీ శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. కే.ఎస్. బింద్ర ఆధ్వర్యంలో శిబిరం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, దేశభక్తి, జాతీయ సమైక్యత వంటి విలువలను అలవర్చుకోవడం ద్వారా సమాజానికి ఉపయోగపడే బాధ్యతాయుత పౌరులుగా క్యాడెట్లను తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. శిబిరం తొలిరోజు వరంగల్ మడ్డివాడ అగ్నిమాపక సిబ్బంది ఆధ్వర్యంలో అగ్నిమాపక అధికారి ఎం.డి. అయూబ్ నేతృత్వంలో క్యాడెట్లకు ప్రమాదాల నివారణ, అగ్నిప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అత్యవసర పరిస్థితుల్లో చేపట్టాల్సిన రక్షణ చర్యలపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వివిధ రక్షణ చర్యలను ప్రదర్శన ద్వారా వివరించారు. శిబిరం రెండో రోజు శనివారం యువజన ఆపదమిత్ర పథకాన్ని ప్రారంభించారు. కార్యక్రమానికి 40వ పోలీసు దళం కమాండెంట్ సత్య శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరై క్యాడెట్లను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రకృతి విపత్తులు, ప్రమాదాలు, ఇతర అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు తక్షణ సహాయం అందించేలా యువతలో అవసరమైన నైపుణ్యాలను పెంపొందించడమే యువజన ఆపదమిత్ర పథకం లక్ష్యమని వివరించారు. సెప్టెంబర్ 12 నుంచి 18 వరకు కొనసాగనున్న ఈ శిక్షణ శిబిరంలో తెలంగాణ రాష్ట్రంలోని వివిధ పాఠశాలలకు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొంటున్నారు. శిబిరంలో భాగంగా క్రమశిక్షణ, నాయకత్వం, దేశభక్తి, జాతీయ సమైక్యతతో పాటు విపత్తుల నిర్వహణ, ప్రమాదాల నివారణ, అత్యవసర సమయాల్లో స్పందించే విధానాలపై క్యాడెట్లకు శిక్షణ అందిస్తున్నారు.



# స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై అనిచిత వ్యాఖ్యలు తాత మధు దిష్టిబొమ్మ దగ్ధం

హత్నూర (వాయిస్ టుడే) సెప్టెంబర్ 12 : తెలంగాణ అసెంబ్లీ స్పీకర్, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్‌పై తాత మధు అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ కాంగ్రెస్ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వ్యాఖ్యలను నిరసిస్తూ శుక్రవారం దౌల్తాబాద్ చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా తాత మధు దిష్టిబొమ్మను దగ్ధం చేసి నిరసన తెలిపారు. కాంగ్రెస్ జెండాలు చేతబట్టి నినాదాలు చేస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఉన్నత పదవిలో కొనసాగుతున్న అసెంబ్లీ స్పీకర్‌పై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదని నాయకులు మండిపడ్డారు.

స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని క్షమాపణలు చెప్పాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. తెలంగాణలో రాజకీయంగా భిన్నాభిప్రాయాలు ఉండొచ్చుగానీ, వ్యక్తిగతంగా కించపరిచే వ్యాఖ్యలు చేయడం మాత్రం తగదని వారు పేర్కొన్నారు. ఆందోళన నేపథ్యంలో దౌల్తాబాద్ చౌరస్తాలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సత్వర న్యాయం అందించడమే లోక్ అదాలత్ లక్ష్యం

**జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ శివ నాయక్**




భద్రాచలం, సెప్టెంబర్ 12 : భద్రాచలం జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు, అడిషనల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు ప్రాంగణాల్లో శనివారం జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ శివ నాయక్ మాట్లాడుతూ, లోక్ అదాలత్ ద్వారా కక్షిదారులకు సత్వర న్యాయం అందించడంతో పాటు సమయం, ఖర్చు ఆదా అవుతుందని అన్నారు. రాజీకి అవకాశం ఉన్న కేసులను ఇరుపక్షాల అంగీకారంతో పరిష్కరించుకోవడానికి లోక్ అదాలత్ మంచి వేదిక అని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అడిషనల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఏ. దుర్గ భవాని మాట్లాడుతూ, లోక్ అదాలత్‌ల ద్వారా వివాదాలను సఖ్యతతో పరిష్కరించుకోవచ్చని, కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న రాజీకి అవకాశం ఉన్న కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవడం ద్వారా కక్షిదారులకు త్వరితగతిన ఉపశమనం లభిస్తుందని తెలిపారు. భద్రాచలం బార్ అసోసియేషన్ అధ్యక్షులు కొడాలి శ్రీనివాసన్ మాట్లాడుతూ, లోక్ అదాలత్‌లు ప్రజలకు ఎంతో ఉపయోగకరమైన న్యాయ వేదికలని, కక్షిదారులు తమ కేసులను రాజీ మార్గంలో పరిష్కరించుకునేందుకు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. న్యాయవాదులు కూడా కక్షిదారులకు లోక్ అదాలత్ ప్రయోజనాలపై అవగాహన కల్పించాలని సూచించారు. భద్రాచలం బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పూసాల శ్రీనివాస చారి మాట్లాడుతూ, లోక్ అదాలత్ ద్వారా కేసుల త్వరిత పరిష్కారం సాధ్యమవుతుందని, కక్షిదారులకు సత్వర న్యాయం అందించడంలో లోక్ అదాలత్‌లు కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా భద్రాచలం జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో జరిమానా కేసులు 74 గాను రూ. 2,50,000 /-, రాజి కేసులు 28, చెక్ బౌన్స్ కేసులు 15, రాజీ కాగా బ్యాంకు కేసులు 27 కు గాను రూ.41,41,600/- మొత్తం బ్యాంకు వారికి వసూలు అయ్యాయి.

అదేవిధంగా అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ కోర్టులో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు 890 కి గాను రూ. 1,95,900/-, అలాగే పెట్టి కేసులు 37కు గాను రూ. 6,500/- మొత్తం వసూలు అయ్యాయి. కచ్చిదారుల సౌకర్యార్థం రోటరీ క్లబ్ ఆఫ్ భద్రాచలం మరియు భద్రాచలం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రోటరీ అధ్యక్షులు ఎస్.కె అజీమ్, ప్రధాన కార్యదర్శి పి రాజేష్, కోశాధికారి కొత్త రామకృష్ణ కక్షి దారులకు అల్పాహారం పంపిణీ చేశారు. అదేవిధంగా శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో కక్షిదారులకు పులిహోర ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం బార్ అసోసియేషన్ అధ్యక్షులు కొడాలి శ్రీనివాసన్, ప్రధాన కార్యదర్శి పూసాల శ్రీనివాసాచారి చారి, సంయుక్త కార్యదర్శి తాత లలిత, కోశాధికారి దన్నాన రాము, లేడీ రిప్రజెంటివ్ తరుణి, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్, భద్రాచలం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మెయిన్ బ్రాంచ్ మేనేజర్ మరియు సిబ్బంది, లోక్ అదాలత్ మెంబర్స్ రావి రామ్మోహన్, పి భాస్కరరావు, సీనియర్ న్యాయవాదులు పేరాల వెంకటేశ్వర్లు, పేరాల నాగరాజు, ముత్యాల కిషోర్, పల్లపు మస్తాన్ బాబు, పరిషిక సోమరాజు, బండారు అరుణ్ చంద్, కె అరుణ శ్రీ, పామరాజు తిరుమలరావు, అవులూరి సత్యనారాయణ, ఎం.వి.రమ, సాధన పల్లి సతీష్, ఎస్. నర్మద, సింగారం మల్లేష్, బి. శారద, బీవీ కార్తీక్, కారం రమేష్, వర్ధన్, రాజేష్, కొత్తపల్లి రాంబాబు కోరాడ శ్రీనివాస్ , అరవింద్, చల్లా శివకృష్ణ, చందన, మధు, కక్షిదారులు పాల్గొన్నారు.




# ఉత్సహంగా అథ్లెటిక్స్ పోటీలు

మక్తల్ సెప్టెంబర్ 12 వాయిస్ టుడే ప్రతినిధి: మక్తల్ పట్టణంలో ఈనెల 11 న నిర్వహించిన లక్ష్య అథ్లెటిక్స్ సెంటర్ ఆధ్వర్యంలో జరిగిన పోటీలలో అన్ని పాఠశాల విద్యార్థులు పాల్గొని విజయవంతంగా నిర్వహించడం జరిగింది అని కోచ్ జగదీశ్ తెలిపారు.... ఈ కార్యక్రమానికి ఙూా వెంకటేష్ శెట్టి గారు, జిల్లా అథ్లెటిక్స్ సెక్రటరీ రమణ గారు విచ్చేసి జెండా ఊపి క్రీడా పోటీలను ప్రారంభించడం జరిగింది. ఈ సందర్బంగా కోచ్ జగదీశ్ మాట్లాడుతూ మన మక్తల్ పట్టణంలోని క్రీడా ఆణిముత్యాలను వెలికి తీసి వారికీ ఉచితంగా మా సెంటర్లో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, అలాగే తెలంగాణ ప్రభుత్వం కూడా ఉద్యోగ విషయంలో కూడా 2% రిజర్వేషన్ కల్పించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్ క్లాబ్ కార్యదర్శి రమేష్ రావు, అంబాదాస్, రమణ,పరంజ్యోతి,రాజేశ్వరి,, సందీప్, బీమారెడ్డి,అంజి, రమేష్, హర్షవర్ధన్, వెంకటేష్,పాల్గొన్నారు.





## హోరాహోరీగా ఎస్‌జీఎఫ్ టేబుల్ టెన్నిస్ పోటీలు

**- ఎస్ఎన్ఆర్ స్పోర్ట్స్ అకాడమీలో ఉత్సాహంగా పోటీలు**

సుల్తానాబాద్, పెద్దపెల్లి జిల్లా సెప్టెంబర్-12 (వాయిస్ టుడే) : విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని సుల్తానాబాద్ మండల ఎంఈఓ రాజయ్య, పెద్దపల్లి జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి కనుకుంట్ల లక్ష్మణ్ అన్నారు. సుల్తానాబాద్‌లోని ఎస్ఎన్ఆర్ స్పోర్ట్స్ అకాడమీలో శనివారం పెద్దపల్లి జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ టేబుల్ టెన్నిస్ పోటీలు ఘనంగా నిర్వహించారు.పోటీలను ఎంఈఓ రాజయ్య, జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి కనుకుంట్ల లక్ష్మణ్, పీఈటీ కార్యదర్శి దాసరి రమేష్, సుల్తానాబాద్ స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు ముస్త్యాల రవీందర్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,క్రీడలతో విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, ఏకాగ్రత పెంపొందుతాయని పేర్కొన్నారు. ప్రతిభ కలిగిన క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన క్రీడాకారులు పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. టేబుల్ టెన్నిస్‌లో నైపుణ్యాలను ప్రదర్శిస్తూ విజయమే లక్ష్యంగా తలపడ్డారు. పోటీల అనంతరం విజేతలకు పెద్దపల్లి జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు కోడం అజయ్ బహుమతులు అందజేసి అభినందించారు.ఈ కార్యక్రమంలో సుల్తానాబాద్ మండల ఎస్‌జీఎఫ్ కన్వీనర్ తాండ్ర ప్రణయ్, వ్యాయామ ఉపాధ్యాయులు ఆసియా, సరస్వతి, ఎస్ఎన్ఆర్ స్పోర్ట్స్ అకాడమీ కోచ్ సత్యనారాయణ విద్యార్థులు,తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు..



## మత్స్య పారిశ్రామిక సహకార సంఘానికి నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

**- అధ్యక్షుడిగా కంకణాల చిన్న కొమురయ్య**

**- ఉపాధ్యక్షుడిగా చొప్పరి అరుణ్‌కుమార్**

సుల్తానాబాద్, పెద్దపెల్లి జిల్లా సెప్టెంబర్-12 వాస్ టుడే : సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని పూసాల లో మత్స్య పారిశ్రామిక సహకార సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం సభ్యులు, మత్స్యకారుల సమక్షంలో నిర్వహించిన ఎన్నికల ప్రక్రియలో అధ్యక్షుడిగా కంకణాల చిన్న కొమురయ్య, ఉపాధ్యక్షుడిగా చొప్పరి అరుణ్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.అలాగే సంఘం ప్రధాన కార్యదర్శిగా చీకట్ల నాగరాజు లను ఏకగ్రీవంగా ఎన్నుకోగా, డైరెక్టర్ లు గా కొలిపాక రమేష్, చీకట్ల సారయ్య, చొప్పరి శ్రీనివాస్, ఉస్తేం శంకరయ్య, కంకణాల ప్రభాకర్, బొజ్జ రమేష్,ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ.. తమపై నమ్మకంతో ఏకగ్రీవంగా ఎన్నుకున్న సంఘ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. మత్స్యకారుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తామని, సంఘ అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు.మత్స్యకారుల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన మత్స్యకారులకు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.సంఘ సభ్యులందరినీ సమన్వయం చేసుకుంటూ మత్స్య పారిశ్రామిక సహకార సంఘాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపేందుకు కృషి చేస్తామని నూతన కార్యవర్గ సభ్యులు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ సిద్ధ తిరుపతి, మాజీ కౌన్సిలర్ గుర్రాల శ్రీనివాస్, మాజీ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ప్రెసిడెంట్ గుర్రాల మల్లేశం, మాజీ సంఘం ప్రెసిడెంట్, సంఘం వైస్ ప్రెసిడెంట్ చొప్పరి శ్రీనివాస్,ఉస్తేం రవి, మాజీ ఎంపీటీసీ,కంకణాల ఆశాలు, చీకట్ల రాజయ్య, ఉస్తేం శ్రీనివాస్, కంకణాల తిరుపతి,సంఘ సభ్యులు, మత్స్యకారులు పాల్గొని నూతన కార్యవర్గ సభ్యులకు అభినందనలు తెలిపారు..



## డిజిటల్ క్రాప్ సర్వేలో ఉద్యాన పంటల నమోదు తప్పనిసరి

సుల్తానాబాద్ పెద్దపల్లి జిల్లా సెప్టెంబర్-12 వాయిస్ టుడే: డిజిటల్ క్రాప్ సర్వేలో ఉద్యాన పంటల వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమల అధికారి గడ్డం శ్యామ్ ప్రసాద్ సూచించారు. శుక్రవారం సుల్తానాబాద్ మండలం చిన్నకల్వల గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న డిజిటల్ క్రాప్ సర్వేను ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా రైతులు వ్యవసాయ శాఖ సిబ్బందికి సహకరించి తమ పంటల వివరాలను యాప్‌లో ఖచ్చితంగా నమోదు చేయించుకోవాలని కోరారు. ఎర్ర మిరప, కూరగాయలు, పసుపు, పూలు, పండ్ల తోటలు, ఆయిల్‌పామ్ తదితర ఉద్యాన పంటల వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు.సర్వే ద్వారా పంటల సాగు విస్తీర్ణం పై ఖచ్చితమైన సమాచారం లభిస్తుందని, దీని ఆధారంగా భవిష్యత్ లో ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, మార్కెటింగ్ అవకాశాలు మరింత సమర్థవంతంగా కల్పించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రవంతి రమేష్, హెచ్ ఈ ఓ, మహేష్, సర్వే వాలంటీర్ హరీష్, రైతులు తదితరులు పాల్గొన్నారు..

# శ్రీహరిరావు ప్రత్యేక చొరవతో సరస్వతి కాలువకు నీటి విడుదల



నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే)సెప్టెంబర్ 12 నిర్మల్: నిర్మల్ నియోజకవర్గంలోని సోన్, లక్ష్మణచాందా, మామడ మండలాల రైతుల సాగునీటి సమస్యను పరిష్కరించేందుకు సరస్వతి కాలువకు ఆదివారం ఉదయం నీటిని విడుదల చేయనున్నట్లు నిర్మల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సోమ భీమ్‌రెడ్డి తెలిపారు. శనివారం నిర్మల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా మూడు మండలాల్లో రైతులు సాగు చేసిన పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని భీమ్‌రెడ్డి తెలిపారు. ఈ నేపథ్యంలో రైతులు, ప్రజాప్రతినిధులు నిర్మల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ కూచాడి శ్రీహరి రావును కలిసి సరస్వతి కాలువకు నీటిని విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారని చెప్పారు.

రైతుల సమస్యను గుర్తించిన శ్రీహరిరావు ప్రత్యేక చొరవ తీసుకుని ఈ విషయాన్ని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ దృష్టికి తీసుకెళ్లారని, అనంతరం నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి కూడా విజ్ఞప్తి చేశారని భీమ్‌రెడ్డి తెలిపారు. శ్రీహరిరావు విజ్ఞప్తిపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులతో చర్చించి ఆదివారం ఉదయం సరస్వతి కాలువకు నీటిని విడుదల చేయడానికి ఆదేశాలు జారీ చేశారని పేర్కొన్నారు. శ్రీహరిరావు ప్రత్యేక చొరవతో నీటి విడుదలకు మార్గం సుగమం కావడంతో మూడు మండలాల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. సోన్, లక్ష్మణచాందా, మామడ మండలాల్లో సుమారు 20 వేల ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతున్నాయని, ఈ నీటి విడుదలతో ఆయా ప్రాంతాల రైతులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని భీమ్‌రెడ్డి అన్నారు. నీటిని వారాబందీ పద్ధతిలో విడుదల చేయనున్నందున రైతులు సమన్వయంతో నీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ఆత్మ చైర్మన్ కొండ్రు రామ్‌రెడ్డి, గండి రామన్న , దత్తసాయి ఆలయ చైర్మన్ కొట్టె శేఖర్ లక్ష్మణచాందా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నరేశ్‌రెడ్డి, మామడ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సంతోష్ , బాపయ్య, ప్రతాప్ రెడ్డి గంగారెడ్డి కలగిరి తదితరులు పాల్గొన్నారు.



## రాజీ దారే విజయ మార్గం

**లోక్ అదాలత్‌లతో సమ న్యాయం: జడ్జి దుర్గం గణేశ్**

సుల్తానాబాద్, సెప్టెంబర్-12 (వాయిస్ టుడే): రాజీ మార్గమే రాజ మార్గం అని, లోక్ అదాలత్ లతో ఇరు వర్గాలకు సమ న్యాయం అందుతుందని జూనియర్ సివిల్ జడ్జి దుర్గం గణేశ్ అన్నారు. శనివారం జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక కోర్టు ఆవరణలో లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి గణేష్ మాట్లాడుతూ లోక్ అదాలత్ లలో ఇరు పక్షాల అంగీకారంతో రాజీ మార్గం ద్వారా కేసులను పరిష్కరించుకోవచ్చని అన్నారు. కక్షిదారులు వ్యయ ప్రయాసలకు గురికాకుండా ఇరు వర్గాలు రాజీ ద్వారా తమ కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు. ఇరువర్గాలు రాజీ మార్గంలో కేసులను పరిష్కరించుకోవడం ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని అన్నారు. లోక్ అదాలత్ తీర్పులపై ఎలాంటి అప్పీలు ఉండదని తెలిపారు. ఈ లోక్ అదాలత్ లో పలు క్రిమినల్ కేసులు, కుటుంబ వివాదాలు, భూమి తగాదాలు, చెక్ బౌన్స్, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులకు సంబంధించి దాదాపు 1210 కేసులు పరిష్కారం అయ్యాయని కోర్టు అధికారులు తెలిపారు . ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వోడ్నాల రవీందర్, ఏజీపీ దూడం ఆంజనేయులు, సెంకడ్ క్లాస్ మెజిస్ట్రేట్ నేరెళ్ల శంకరయ్య,, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఆవుల శివకృష్ణ, సంయుక్త కార్యదర్శి గుడ్ల వెంకటేష్ లతో పాటు పలువురు న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## దళిత స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు సిగ్గుచేటు

**గడ్డం ప్రసాద్ కుమార్ పై తాత మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన జహీరాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పి.నర్సింహారెడ్డి**

జహీరాబాద్,వాయిస్ టుడే సెప్టెంబర్12: జహిరాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశం జహీరాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పి.నర్సింహారెడ్డి అధ్యక్షతన జరిగింది.వారు మాట్లాడుతూ... అసెంబ్లీ స్పీకర్గా గౌరవప్రదమైన రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న గడ్డం ప్రసాద్ కుమార్ పై తాత మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను మండల అధ్యక్షులు నర్సింహారెడ్డి తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో శాసనసభ స్పీకర్ పదవికి అత్యంత గౌరవం, హోదా ఉంటుందని, అలాంటి ఉన్నత స్థానంలో ఉన్న దళిత బిడ్డపై వ్యక్తిగతంగా అవమానకర వ్యాఖ్యలు చేయడం తాత మధు రాజకీయ సంస్కారానికి అద్దం పడుతోందని నర్సింహారెడ్డి మండిపడ్డారు.రాజకీయ విమర్శలకు హద్దులు ఉంటాయని, పదవిలో ఉన్న వ్యక్తిని కించపరిచేలా మాట్లాడటం ప్రజాస్వామ్య విలువలను అవమానించడమేనని అన్నారు.అధికారాన్ని కోల్పోయిన అక్కసుతో రాజ్యాంగబద్ధ పదవులపై బురదజల్లే ప్రయత్నాలు చేయడం ప్రజలు సహించరని హెచ్చరించారు. దళిత సమాజానికి చెందిన వ్యక్తి రాష్ట్ర శాసనసభ స్పీకర్గా అత్యున్నత స్థానంలో ఉండటాన్ని జీర్ణించుకోలేకనే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారా అని ప్రశ్నించారు. స్పీకర్ పైచేసిన వ్యాఖ్యలకు తాత మధు వెంటనే బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ యం.పి.పి రాములు,సిడిసి డైరెక్టర్ మల్లారెడ్డి,సర్పంచ్ లు బి.రవి,నరేష్,యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్ రెడ్డి,మరియు సీనియర్ నాయకులు నర్సింహులు,దిలీప్ కుమార్,రాజు,సురేష్ 'హోతి బి',సుభాష్ రెడ్డి,దిడ్గి సురేష్,రాయిపల్లి డి సంజీవరెడ్డి,సంజీవ్,ఇమామ్ పటేల్,నాగరాజు,జగన్ మరియు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గాంధీనగర్ ఓల్డ్ పోచంపాడ్ గ్రామంలో చెత్త బుట్టల పంపిణీ కార్యక్రమం



నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే)సెప్టెంబర్ 12: నిర్మల్ జిల్లా సోన్ మండలం గాంధీనగర్ గ్రామంలో సర్పంచ్ బోయి రుసుంకుంటే ఆమని- బస్వరాజ్ ఆధ్వర్యంలో మహిళలకు తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించేందుకు ప్రత్యేక చెత్త బుట్టలను పంపిణీ చేయడం జరిగింది. తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి గ్రామపంచాయతీ ట్రాక్టర్‌లోనే వేయాలని గ్రామంలో పరిశుభ్రతను పాటిస్తూ చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సర్పంచ్ సూచించారు. మన గాంధీనగర్ గ్రామాన్ని పరిశుభ్రంగా, స్వచ్ఛంగా ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని కోరారు. కార్యక్రమంలో పాల్గొన్నవారు: గ్రామ సర్పంచ్ ఆమని- బస్వరాజ్ గ్రామ పంచాయతీ కార్యదర్శి సంగీత,వార్డు సభ్యులు సాలుకే ముకెందర్, రుసుంకుంటే సాయమ్మ ,మహిళలు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.



## నిర్మల్‌లో సీతారాం ఏచూరి రెండవ వర్ధంతి

**సీతారాం ఏచూరి గారి ఆశయాలను కొనసాగిస్తాం: సిపిఎం**

నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే)సెప్టెంబర్ 12: నిర్మల్ జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భవన్‌లో సిపిఎం నిర్మల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సీతారాం ఏచూరి గారి 2వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఉడుత రవిందర్ మాట్లాడుతూ, సీతారాం ఏచూరి భారత కమ్యూనిస్టు ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని అన్నారు. దేశంలో ప్రజాస్వామ్యం, లౌకికవాదం, సామాజిక న్యాయం, పేదలు, కార్మికులు, రైతుల హక్కుల కోసం ఆయన జీవితాంతం పోరాడారని తెలిపారు.

కేంద్ర బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలను మరింత ఉధృతం చేయడమే సీతారాం ఏచూరి ఆశయాలను కొనసాగించడానికి నిజమైన మార్గమని అన్నారు. ఆయన చూపిన మార్గంలో సిపిఎం కార్యకర్తలు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దుర్గం నూతన్ కుమార్, బొమ్మెన సురేష్ సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గంగామణి లలిత, శైలేజా తదితరులు పాల్గొన్నారు.



## ఆమ్ ఆద్మీ పార్టీ టౌన్ ఇంచార్జి ద్యావరశెట్టి రవికి మాతృవియోగం కుటుంబాన్ని పరామర్శించిన పార్టీ నాయకులు

నిర్మల్, (వాయిస్ టుడే సె)ప్టెంబర్ 12 ఆమ్ ఆద్మీ పార్టీ టౌన్ ఇంచార్జి ద్యావరశెట్టి రవి వారి అమ్మగారు పరమపదించిన విషయం తెలుసుకున్న పార్టీ నాయకులు వారి కుటుంబాన్ని పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ సయ్యద్ హైదర్ తో పాటు జిల్లా వైస్ ప్రెసిడెంట్ బండారు శ్రీనివాస్, జనరల్ సెక్రటరీ సీ.హెచ్. వినోద్, ట్రెజరర్ అబ్దుల్ సాధిక్, నియోజకవర్గ ఇంచార్జి మెరుగు రాజన్న, స్పోక్స్ పర్సన్ వసంతరావు తదితర పార్టీ నాయకులు పాల్గొని రవి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కష్ట సమయంలో కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని, మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని నాయకులు ప్రార్థించారు.

VOICE OF PRAJALU
వాయిస్ ఆఫ్ ప్రజలు
ప్రజల గొంతుక - నిజం కోసం..



# తెలంగాణ విమోచన దినోత్సవం అధికారికంగా నిర్వహించాలి

తొర్రూరు, సెప్టెంబర్ 12 వాయిస్ టుడే : నిజాం నిరంకుశ పాలన నుండి తెలంగాణ సంస్థానం సర్దార్ వల్లభాయ్ పటేల్ ప్రత్యేక చొరవ ద్వారా భారత దేశంలో విలీనం అయిన సెప్టెంబర్ 17 న తెలంగాణా విమోచన దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించి తెలంగాణ ప్రజల మనోభావాలను గౌరవించాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ వన్నాల వెంకట రమణ డిమాండ్ చేశారు. ఈరోజు తొర్రూరు పట్టణంలో స్థానిక గెస్ట్ హౌస్ లో బీజేపీ తొర్రూరు అర్బన్ అధ్యక్షుడు పైండ్ల రాజేష్ సభాధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారత దేశానికి ఆగస్టు 15న స్వాతంత్ర్యం సిద్దిస్తే నిజాం నిరంకుశ పాలన లో ఉన్న తెలంగాణ ప్రాంతానికి సెప్టెంబర్ 17 న స్వాతంత్ర్యం వచ్చింది అని తెలిపారు. నిజాం నిరంకుశ పాలన లో తెలంగాణ ప్రజలు నరకం చవిచూశారు అని, రకరకాల పన్నులతో పాటు ప్రజల రక్తాన్ని జలగల్లా పీల్చుకు తిన్నారని, విచ్చల విడిగా మత మార్పిడిలకు పాల్పడి ఎదురు తిరిగిన ప్రజలను చిత్ర హింసలకు గురిచేశారని,మహిళల మాన ప్రాణాలను తీసేసారని, చివరికి తెలంగాణ ప్రాంతాన్ని పాకిస్థాన్ లో కలుపడానికి కుట్రలు పన్నిన నిజాం నవాబు ధాష్టీకాలను అప్పటి భారత ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ ప్రత్యేక చొరవ చూపి ఆపరేషన్ పోలో ద్వారా నిజాం నవాబు మెడలు వంచి తెలంగాణ కు విముక్తి కల్పించాడని అలాంటి



ప్రాముఖ్యత కలిగిన సెప్టెంబర్ 17 న ప్రభుత్వం అధికారికంగా వేడుకలు నిర్వహించక పోవడం వెనుక కేవలం ముస్లిం ఓటు బ్యాంకు, మజ్లిస్ పార్టీ ఒత్తిడి కారణం అని తెలిపారు.కేంద్ర ప్రభుత్వం గత రెండేళ్లుగా ఈ ఉత్సవాలను అధికార లాంఛనాలతో నిర్వహిస్తూ తెలంగాణ విమోచనోద్యమం లో అసువులు బాసిన అమర వీరుల కు ఘన నివాళులు అర్పించడం జరుగుతుంది అని తెలిపారు.తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వచ్చాక తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించి తెలంగాణ ప్రజల మనోభావాలను, ఆత్మ గౌరవాన్ని కాపాడుతామని తెలిపారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర నాయకులు లేగా రాంమోహన్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు పల్లె కుమార్,రంగు రాములు, చింతా స్రృజన్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొలుపుల శంకర్, తొర్రూరు రూరల్ మండలం అద్యక్షులు గట్టు రాంబాబు, పెద్దవంగర మండల అధ్యక్షుడు కట్టోజు భాస్కరా చారి, జిల్లా నాయకులు పూసాల శ్రీమాన్, అలిసేరి రవిబాబు, దేవరకొండ విష్ణు, మండల ప్రధాన కార్యదర్శి నడిగడ్డ సందీప్, బీజేవైఎం జిల్లా నాయకులు నూకల నవీన్,తూర్పాటి సాయి ముకేష్,తూర్పాటి మోహిత్ తదితరులు పాల్గొన్నారు.

## వినాయక చవితి రోజు ప్రజావాణి రద్దు

### సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట



భద్రాచలం, సెప్టెంబర్ 12: ఈ సోమవారం భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగే ప్రజావాణి కార్యక్రమం వినాయక చవితి పండుగ సెలవు ఉన్నందున రద్దు చేసినట్లు సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట ఒక ప్రకటనలో తెలిపారు. వినాయక చవితి పండుగ సెలవు ఉన్నందున రెవెన్యూ డివిజన్ అధికారులు ఎవరు అందుబాటులో ఉండని కారణంగా ప్రజావాణి కార్యక్రమం రద్దు చేసామని అన్నారు. ఆ రోజు డివిజన్ ప్రజలు దరఖాస్తులు సమర్పించడానికి సబ్ కలెక్టర్ కార్యాలయం కు రావద్దని ఆయన కోరారు.

## పర్యావరణ పరిరక్షణ కార్యక్రమం




వరంగల్( వాయిస్ టుడే ) సెప్టెంబర్ 12 : పర్యావరణ పరిరక్షణలో భాగంగా వందన డిజి హై స్కూల్ ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మట్టి గణపతి విగ్రహాల తయారీ, వినియోగం ద్వారా పర్యావరణాన్ని కాపాడాల్సిన అవసరాన్ని విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ అడెపు శ్యామ్, వైస్ ప్రిన్సిపల్ విజయకుమారి, ఉపాధ్యాయులు అలాగే విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మట్టి గణపతి విగ్రహాలను ప్రోత్సహించడం, ప్లాస్టిక్ మరియు కాలుష్యాన్ని తగ్గించడం, ప్రకృతిని పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని వారు తెలిపారు. “మట్టి గణపతిని పూజిద్దాం – పర్యావరణాన్ని పరిరక్షిద్దాం” అనే సందేశంతో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.




## ఘనంగా హిందీ దివస్

కరీంనగర్,సెప్టెంబర్ 12(వాయిస్ టుడే):హిందీ ప్రేమ మండలి, కరీంనగర్ మరియు లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ సంయుక్త నిర్వహణలో రాష్ట్రీయ హిందీ దివస్ ఘనంగా నిర్వహించారు. సీనియర్ సిటిజెన్ డే కేర్ సెంటర్ అధ్యక్షులు ఎం.అంజయ్య అధ్యక్షతన జరిగిన సభలో వక్తలు హిందీ భాష ప్రాముఖ్యత గురించి,గొప్పతనము గురించి వివరించారు. ఈ సందర్భంగా ప్రముఖ కవి సబ్బని లక్ష్మీనారాయణ హిందీ లోనికి అనువాదం చేసిన కవితా సంపుటి మౌన సముద్ర ను వేదిక మీది పెద్దలు ఆవిష్కరించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుండి వచ్చిన సుమారు యాభై మందికి పైగా హిందీ పండిట్ లకు లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ తరపున అభినందన సర్టిఫికెట్ అందచేస్తూ ఘనంగా శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉప్పల రామేశం,కోల అన్నారెడ్డి, బోయినపల్లి హనుమంత రావు, చింతల సత్యనారాయణ, మ్యాడమ్ శివకాంత్,పెద్ది విద్యాసాగర్,సింగమ రాజు,ముక్క శరత్ కృష్ణ,బట్టు వినోద్,కేశవరెడ్డి, ప్రొఫెసర్ వాసాల వరప్రసాద్, మరియు హిందీ ఉపాధ్యాయులు ఉమర్ అలీ,ఎం.భారతి, విజయలక్ష్మి,యోగా సంపత్,బాల్ రెడ్డి,నుజెట్టి రవీంద్ర నాథ్, శివనారాయణ పాల్గొన్నారు.

## పాల్వంచలో ఘనంగా శ్రీ విఘ్నేశ్వర స్వామి వారి నవరాత్రి మహోత్సవాలు







పాల్వంచ, సెప్టెంబర్ 12 (వాయిస్ టుడే ): భద్రాద్రి కొత్తగూడెం పాల్వంచ పట్టణంలో సుమారు 50 సంవత్సరాల క్రితం మొట్టమొదటిసారిగా గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రారంభించిన ఘన చరిత్ర కలిగిన వర్తక సంఘం ఆధ్వర్యంలో, శ్రీ ఈశ్వర్ గణేష్ మహల్ నందు శ్రీ విఘ్నేశ్వర స్వామి వారి నవరాత్రి మహోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే 14వ తారీఖు నాడు ఉదయం 9:50 కు శ్రీ సిద్ధి విఘ్నేశ్వర స్వామి వారి ప్రతిష్ట కార్యక్రమం జరుగుతుంది. వర్తక సంఘం ఆధ్వర్యంలోని ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షులు పెండ్యాల కృష్ణ, అధ్యక్షులు చలవాది ప్రకాష్, ప్రధాన కార్యదర్శి గూడెపు శ్రీనివాస్, కోశాధికారి బచ్చు శ్రీనివాస్, మహిళా సేవాదళ్ అధ్యక్షురాలు పెండ్యాల రోజా లక్ష్మి వారి ఆధ్వర్యంలో ఈ నవరాత్రి మహోత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ నవరాత్రి మహోత్సవాల్లో భక్తి, ఆధ్యాత్మికతతో పాటు సంస్కృతిని ప్రతిబింబించే విధంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, అష్టోత్తర పూజలు, కుంకుమ పూజలు, శ్రీ సత్యనారాయణ స్వామివారి వ్రతం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అలాగే వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రోత్సహిస్తూ వారికి బహుమతులు, అవార్డులు అందజేయనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.




## రాష్ట్ర స్థాయి (కరాటే) పోటీలలో కివి పబ్లిక్ స్కూల్ విద్యార్థిని విద్యార్థులకు బంగారు వెండి పతకాలు

వరంగల్ ( వాయిస్ టుడే ) సెప్టెంబర్ 12 : మంచిర్యాల జిల్లా మంద మర్రి లోని జి.యమ్.ఆర్ కరాటే , సెల్ఫ్ డిఫెన్స్ అకాడమి మంచిర్యాల బ్రాంచ్ వారు 5వ రాష్ట్ర స్థాయి కరాటే చాంపియన్ షిప్ -2026 పోటీలను నగరం లోని ఓ పంక్షన్ హాల్ లో ఇటీవల నిర్వహించడం జరిగింది. ఈ రాష్ట్ర స్థాయి (కరాటే) పోటీల లో కివి పబ్లిక్ స్కూల్, కరిమాబాద్, విద్యార్థినీ విద్యార్థులు బంగారు మరియు వెండి పతకాలు సాధించారు. ఈ పోటీలకు గాను 17 జిల్లాల నుండి సుమారు 600 హాజరు అయినారు. ఈ పోటీల లో కివీ పబ్లిక్ స్కూల్ విద్యార్థినీ విద్యార్థులకు కటాస్ అలాగే కుమిటే విభాగాలలో బంగారు, వెండి పథకాలు సాధించడం జరిగినదని ప్రిన్సిపాల్ దాసి సతీష్ మూర్తి తెలిపారు. పథకాలు సాధించిన వారిలో జే. లలిత్, యస్. సాత్విక్, ఏ. ఇసాకు, యమ్.యొజిత్ .యస్.వరుణ్ బంగారు పథకాలు సాధించగా ఇ.సాత్విక్ ఏ. వెంకట రమణ బి.నందకిశోర్, – వెండి పథకాలు సాధించినారు. వీరిని కివి పబ్లిక్ స్కూల్ కరిమాబాద్ ప్రిన్సిపల్ దాసి సతిష్ మూర్తి, వైస్ ప్రిన్సిపల్ అన్నదేవర ప్రవీణ్ కుమార్, లు కోచ్ లు బండారి సంతోష్, యు. రణదీప్, జి. వైష్ణవి లు అభినందించారని కివి పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపల్ దాసి సతీష్ మూర్తి తెలియజేసారు.



## పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత

### మట్టి వినాయకులను పంపిణీ చేసిన కార్పొరేటర్ బోయినపల్లి ప్రవీణ్ కుమార్

కరీంనగర్, సెప్టెంబర్ 12(వాయిస్ టుడే): వినాయక చవితి పండుగను పురస్కరించుకుని పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా 50వ డివిజన్ లో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమం డివిజన్ కార్పొరేటర్ బోయిన్పల్లి ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో పంపిణీ చేసి, ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ బోయిన్పల్లి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్,రసాయన రంగులతో తయారు చేసే విగ్రహాల వల్ల జల వనరులు,పర్యావరణం తీవ్రంగా కలుషితమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. భావితరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రజలంతా మట్టి వినాయకులను పూజించి, పర్యావరణ హితంగా వినాయక చవితి వేడుకలను జరుపుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రకృతిని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ మట్టి ప్రతిమల వైపు మొగ్గు చూపాలని,సంప్రదాయబద్ధంగా పండుగను ఆనందోత్సాహాల మధ్య నిర్వహించుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు,కాలనీవాసులు, డివిజన్ ప్రముఖులు,నాయకులు పాల్గొన్నారు.




## విద్యార్థులు క్రమశిక్షణతో ముందుకు సాగాలి

### సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట

భద్రాచలం, సెప్టెంబర్ 12 : విద్యార్థులు క్రమశిక్షణతో చదువుతూ ముందుకు సాగాల నీ భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాళ్ శ్రేష్ట కోరారు. భద్రాచలం లోని మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ బీసీ సంక్షేమ రెసిడెన్షియల్ కళాశాల (బాలికల) ను ఆకస్మికంగా స్థానిక చేసిన సమయంలో కళాశాలకు సంబంధించిన సమస్యలను కళాశాల సిబ్బంది తన దృష్టికి తీసుకురావడం జరిగిందని సబ్ కలెక్టర్ శ్రీ మృణాల్ శ్రేష్ట అన్నారు. శనివారం ఆయన బీసీ వెల్ఫేర్ కళాశాలలో విద్యార్థులకు విద్యా వాతావరణాన్ని, సౌకర్యాలను మరింత మెరుగుపరచడానికి సబ్-డివిజనల్ పరిపాలన విభాగం ఐటీసీతో భాగస్వామ్యం చేసుకొని విద్యకు సంబంధించిన వారికి కావలసిన మెటీరియల్ ఐటీసీ తన సీఎస్ఆర్ కింద డెస్క్‌టాప్‌లు, కంప్యూటర్ ల్యాబ్ ఫర్నిచర్, అదనపు డెస్క్‌లు మరియు బెంచీలను అందించామని అన్నారు.

మెటీరియల్ తో పాటు కాంపిటేటివ్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు వాటికి సంబంధించిన ఐఐటీ-జేఈఈ (IIT-JEE) ఽ నీట్ ప్రిపరేషన్ వనరులను కూడా విద్యార్థులకు అందించడం జరిగిందని అన్నారు. పోటీ పరీక్షలకు సంబంధించిన మెటీరియల్ విద్యార్థులు పూర్తిగా సద్వినియోగం చేసుకొని, ఐఐటీ-జేఈఈ ఽ నీట్ పరీక్షలలో జాతీయ స్థాయి విజయాన్ని లక్ష్యంగా పెట్టుకోవాలని అధ్యాపకులను, విద్యార్థులను ఆయన ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో ఐటీసీ జిఎం చంగల్ రావు, అధ్యాపకులు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



## లోక్ అదాలత్ ద్వారా సత్వర న్యాయం

### – సీనియర్ సివిల్ జడ్జి,నక్కా శ్యాంసుందర్

హుజూర్ నగర్: సెప్టెంబర్, 12 (వాయిస్ టుడే ప్రతినిధి): లోక్ అదాలత్‌లో కేసులను రాజీ చేసుకోవడం మూలంగా సత్వర న్యాయం లభించినట్లు అవుతుందని సీనియర్ సివిల్ జడ్జి నక్కా శ్యాంసుందర్ అన్నారు. శనివారం స్థానిక కోర్టు ప్రాంగణంలో జరిగిన జాతీయ మెగా లోక్ అదాలత్ లో ఆయన కక్షిదారులను ఉద్దేశించి మాట్లాడారు. ఇరుపక్షాల విజయం, కోర్టు ఫీజు తిరిగి పొందడం, రాజీ అవార్డు పొందడం లాంటి ఎన్నో ప్రయోజనాలు లోక్ అదాలత్ వల్ల లభిస్తుందన్నారు. చెక్కు బౌన్స్ కేసులకు సంబంధించి నవంబర్ నెలలో ప్రత్యేక లోక్ అదాలత్ ను నిర్వహించనున్నట్లు న్యాయమూర్తి తెలిపారు. దక్షిణ భారతదేశం కంటే ఉత్తర భారత దేశంలో లోక్ అదాలత్ లకు విశేష స్పందన లభిస్తున్నట్లు ఆయన తెలిపారు. అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఆయేషా సరీన్ మాట్లాడుతూ తరచుగా జరుగుతున్న లోక్ అదాలత్ లను ఉపయోగించుకొని తమ కేసులను రాజీ చేసుకుని ప్రశాంత జీవనం గడపాలని ఆమె కక్షిదారులను కోరారు. లోక్ అదాలతో 378 ,క్రిమినల్ కేసులు,16 సివిల్ కేసులు రాజీ అయ్యాయి. వివిధ నేరాలను అంగీకరించిన కక్షిదారులకు 5,00,000, రూపాయలను జరిమానా గా న్యాయమూర్తులు విధించగా కక్షిదారులు జరిమానాలను చెల్లించారు. వివిధ బ్యాంకులకు చెల్లించవలసిన బకాయిల బాపతు 4,60,000 ,రూపాయలను కక్షిదారులు ఆయా బ్యాంకులకు చెల్లించారు. ఈ కార్యక్రమంలో లోక్ అదాలత్ సభ్యులు పాలేటి శ్రీనివాసరావు, గుగులోతు వెంకటేష్ నాయక్, రామినేని వెంకటేష్, న్యాయవాదులు కాల్వ శ్రీనివాసరావు, నాగేష్ రాథోడ్, కుక్కడపు సైదులు, బుడగ నరేష్, సైదా హుస్సేన్, అజ్మీర చందు, పిడమర్తి చంద్రయ్య, శ్రీను నాయక్, వివిధ బ్యాంకుల అధికారులు, న్యాయ, పోలీస్ శాఖల సిబ్బంది, న్యాయ సేవ అధికార సంస్థ సిబ్బంది అనిత, సుశీల, పారా లీగల్ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



## పెరల్ ఇన్ఫినిటీలో పాఠశాలలో ముందస్తు వినాయక చవితి వేడుకలు

హుజూర్‌నగర్, సెప్టెంబర్, 12 (వాయిస్ టుడే ప్రతినిధి): హుజూర్ నగర్ పట్టణంలోని పెరల్ ఇన్ఫినిటీ పాఠశాలలో ముందస్తు వినాయక చవితి వేడుకలను శనివారం పాఠశాల ఆవరణంలో వినాయకుని విగ్రహాన్ని ప్రతిష్టించి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంప్రదాయ దుస్తులతో, భక్తి గీతాలతో ,సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేసి ఉత్సాహంగా పాల్గొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం డి.సి ప్రకాష్ , ప్రిన్సిపల్ కె. ఏ జో మీ , వైస్ ప్రిన్సిపల్ అజయ్ లు మాట్లాడుతూ గణపతి నవరాత్రుల ప్రాముఖ్యత, వినాయక చవితి విశిష్టతను విద్యార్థులకు వివరించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయక విగ్రహాలను ఉపయోగించాలని, రసాయన రంగులకు దూరంగా ఉండాలని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రకృతిని కాపాడుతూ పండుగలను ఆనందంగా జరుపుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వాయిస్ ఆఫ్ ప్రజలు
హైదరాబాద్
ఆదివారం 13 సెప్టెంబరు 2026




## సభకు రాకుండానే రూ.22 కోట్లు దండుకున్న కేసీఆర్

**అవెలి దామోదర్ రావు ఫైర్**

**ఖబర్దార్ కేసీఆర్ – దళితులకు క్షమాపణ చెప్పాల్సిందే**

కరీంనగర్, సెప్టెంబర్ 12(వాయిస్ టుడే): జిల్లా టీపీసీసీ అధికార ప్రతినిధిగా నియమితులై మొదటిసారి డీసీసీ కార్యాలయానికి వచ్చిన అవెలి దామోదర్ రావు కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్,మాజీ సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి,జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షులు కొరివి అరుణ్ కుమార్,రాజీవ్ గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన్ జిల్లా చైర్మన్ మడుపు మోహన్,జిల్లా కాంగ్రెస్ మైనారిటీ సెల్ అధ్యక్షులు యం.డి తాజుద్దీన్,జిల్లా కాంగ్రెస్ ఎస్టీ సెల్ అధ్యక్షులు బానోతు శ్రావణ్ నాయక్ తో కలిసి మాట్లాడుతూ చామల కిరణ్ కుమార్ రెడ్డి,ఎంపీ ఆదేశాల మేరకు కరీంనగర్ మరియు సిద్దిపేట జిల్లాల నియోజకవర్గాల ఇంచార్జ్ గా ఈ విలేకరుల సమావేశం నిర్వహించడం జరుగుతోందని,గత 30 నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మూడు అసెంబ్లీ సెషన్లు జరిగితే,ప్రతిపక్ష నేత కేసీఆర్ ఒక్కసారి కూడా సభకు రాకుండానే జీతం కింద రూ.12 కోట్లు,సెక్యూరిటీ కింద రూ.10 కోట్లు,మొత్తం రూ.22 కోట్లు తీసుకున్నారు.సభను ఎలా అడ్డుకోవాలి, కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు చేరకుండా ఎలా చేయాలి అనే దురుద్దేశంతోనే బిఆర్ఎస్ నాయకులు వ్యవహరిస్తున్నారు.అందులో భాగంగానే 22 ఏ, ఫార్మా సిటీ,జిఓ 29 పేరుతో పలు రకాల వ్యతిరేక కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. గత 10 ఏళ్లలో కాళేశ్వరం పేరుతో సంపాదించిన అక్రమ సొమ్ముతో సోషల్ మీడియాను మేనేజ్ చేస్తూ లేని వ్యతిరేకతను సృష్టిస్తున్నారు. అసెంబ్లీలో ప్రజా సమస్యలను మాట్లాడేందుకు స్పీకర్ అనుమతి, క్వశ్చన్ అవర్,జీరో అవర్ లాంటి ఎన్నో అవకాశాలు ఉన్నా వాటిని వదిలేసి,కావాలనే అసెంబ్లీ గేటు వద్ద నల్ల చొక్కాలు వేసుకొని గొడవ చేశారు.ఆ టీ–షర్టులపై 1000 రోజుల కాంగ్రెస్ వైఫల్యం అని రాసి ఉంది.ఇలాంటి స్లోగన్స్ ఉన్న బట్టలకు ఏ అసెంబ్లీలోనూ అనుమతి లేదని తెలిసి కూడా,కావాలనే మమ్మల్ని గెంటేయాలని చూపించాలనే ఉద్దేశంతోనే వచ్చారు.మేము 1000 రోజుల్లో మహిళలకు ఫ్రీ బస్,రూ.500 కే గ్యాస్ సిలిండర్,200 యూనిట్ల ఉచిత కరెంటు, ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చాం.ఆర్టిసి ద్వారా మహిళలకు రూ.11వేల కోట్లు ఆదా చేశాం. ఇన్ని చేస్తుంటే మీరు పెయిడ్ ఆర్టిస్టులను పెట్టి దుష్ప్రచారం చేస్తున్నారు.సీఎం రేవంత్ రెడ్డి ఫ్యామిలీపై బురద చల్లుతున్నారు.30 సీట్లు ఉన్నాయని మాట్లాడుతున్న మీకు రాబోయే ఎన్నికల్లో ఆ 30 కూడా రావు. దళిత సమాజానికి బేషరతుగా క్షమాపణ చెప్పేవరకు మా డిమాండ్ కొనసాగుతుంది అని హెచ్చరించారు.ఈ సమావేశంలో నాయకులు గుండాటి శ్రీనివాస్ రెడ్డి, కంకణాల అనిల్ కుమార్,కుంభాల రాజకుమార్ పాల్గొన్నారు.




## ఎస్ఎఫ్ఐ విద్యార్థి ఉద్యమానికి పునాదులు పోసిన గొప్ప నాయకుడు ఏచూరి

**ఎస్ఎఫ్ఐ శాతవాహన యూనివర్సిటీ ఉపాధ్యక్షులు ఓం ప్రకాష్,నవీన్**

కరీంనగర్, సెప్టెంబర్ 12(వాయిస్ టుడే): ఎస్ఎఫ్ఐ విద్యార్థి ఉద్యమానికి పునాదులు పోసిన గొప్ప నాయకుడు ఏచూరీ అని ఎస్ఎఫ్ఐ శాతవాహన యూనివర్సిటీ ఉపాధ్యక్షులు ఓం ప్రకాష్,నవీన్ అన్నారు.ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ శాతవాహన యూనివర్సిటీ ఉపాధ్యక్షులు ఓం ప్రకాష్,నవీన్ మాట్లాడుతూ సీతారాం ఏచూరి జీవితంలోని కీలక ఘట్టాలను,ఆయన అందించిన సేవలను స్మరించుకున్నారు. జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం (జేఎన్‌యూ)లో విద్యార్థి నాయకుడిగా తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన ఏచూరి, ఎమర్జెన్సీ కాలంలో ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం ధైర్యంగా పోరాడారని తెలిపారు.ఎస్ఎఫ్ఐ అఖిల భారత అధ్యక్షుడిగా దేశవ్యాప్తంగా విద్యార్థి ఉద్యమాన్ని బలోపేతం చేయడంలో సీతారాం ఏచూరి పాత్ర చారిత్రాత్మకమని అన్నారు.విద్యా రంగాన్ని ప్రైవేటీకరణ, కాషాయీకరణ నుంచి కాపాడేందుకు,అందరికీ సమానంగా నాణ్యమైన విద్య అందించేందుకు ఆయన నిరంతరం పోరాడారని తెలిపారు.విద్యార్థుల సమస్యల నుంచి దేశం ఎదుర్కొంటున్న సామాజిక,ఆర్థిక, రాజకీయ సంక్షోభాల వరకు ప్రతి అంశంపై ఆయన చేసిన విశ్లేషణలు, ప్రదర్శించిన సిద్ధాంత స్పష్టత అసమానమైనవని కొనియాడారు.

రాజ్యసభ సభ్యుడిగా సుదీర్ఘకాలం పనిచేసిన సీతారాం ఏచూరి దేశంలోని పేదలు,విద్యార్థులు, యువత,రైతులు,కార్మికుల సమస్యలను పార్లమెంట్‌లో అత్యంత సమర్థవంతంగా వినిపించారని అన్నారు. బహుభాషా కోవిదుడిగా, ప్రజాస్వామ్య మరియు లౌకిక విలువల పరిరక్షణకు రాజీలేని పోరాటం చేశారని తెలిపారు. సీతారాం ఏచూరి భౌతికంగా మన మధ్య లేకపోయినప్పటికీ,ఆయన చూపిన పోరాట బాట,అందించిన సిద్ధాంత జ్ఞానం,ప్రజా ఉద్యమాల పట్ల ఆయనకున్న నిబద్ధత భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని అన్నారు.నవసమాజ నిర్మాణానికి ఆయన ఆశయాలు వెలుగుదివ్వెలా మార్గనిర్దేశం చేస్తాయని తెలిపారు.సీతారాం ఏచూరి ఆశయాల సాధన కోసం, ప్రజాస్వామ్య మరియు లౌకిక విలువల పరిరక్షణ కోసం విద్యార్థులు,యువత ముందుకు రావాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.వర్ధంతి సభలో విద్యార్థులు నాయకులు సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కేశవ్,మహేష్, కార్తీక్,వంశీ,తరుణ్,శివాజీ, శ్రీకాంత్, ప్రదీప్,మురళి పాల్గొన్నారు.

# ముగిసిన రాష్ట్రస్థాయి యోగా పోటీలు

## ఓవరాల్ చాంపియన్ కరీంనగర్

**ఖేలో ఇండియాలో పతకాలు సాధించాలి**

**తెలంగాణను నంబర్ వన్‌గా నిలవాలి : ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి**




కరీంనగర్,సెప్టెంబర్ 12(వాయిస్ టుడే): వచ్చే డిసెంబర్లో తెలంగాణలో జరిగే ఖేలో ఇండియా యూత్ గేమ్స్ లో యోగా క్రీడాకారులు ఎక్కువ పథకాలు సాధించాలని అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్ రెడ్డి తెలిపారు.కరీంనగర్ జిల్లా యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో కొత్తపల్లి ఆల్ఫోర్స్ ఈ టెక్నో స్కూల్లో జరిగిన 17వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ జూనియర్ బాలబాలికల యోగ పోటీల ముగింపు కార్యక్రమానికి నరేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. స్వతహాగా క్రీడాకారుడైన రాష్ట్ర ముఖ్యమంత్రి నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తోందని దానిలో భాగంగా ప్రతిష్టాత్మక కేసులో ఇండియా పోటీలకు మన రాష్ట్రం ఆతిథ్యమిస్తుంది అన్నారు. యోగాతో పాటు మిగతా క్రీడలో రాణించి తెలంగాణను నంబర్ వన్ గా నిలపాలన్నారు.యోగా నేడు ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలకు పరిచయం అయిందని రానున్న ప్రపంచ స్థాయి యోగా పోటీల్లో భారతదేశానికి తిరుగు లేదన్నారు. విద్యార్థి దశ నుంచి తమకు అభిరుచి ఉన్న క్రీడల్లో ప్రణాళిక బద్ధంగా నిత్య సాధన చేస్తేనే ఉన్నత స్థాయికి ఎదుగుతారన్నారు.కేవలం పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా క్రీడల్లో భాగస్వాములు అయితే రిజర్వేషన్ ద్వారా విస్తృత ప్రయోజనాలు ఉన్నాయన్నారు.ప్రత్యేకించి సీబీఎస్ఈ లో అదనపు సబ్జెక్టుగా యోగాను ఎంపిక చేసుకునే అవకాశము ఉందన్నారు.క్రీడల్లో గెలుపు ఓటమి సహజమని తమ సాధించిన ప్రతిభను విశ్లేషించుకుని క్రీడాకారులు ముందుకెళ్లాలన్నారు. చదువులతోపాటు క్రీడలకు ప్రాధాన్యతనిస్తూ రాష్ట్రస్థాయి పోటీలకు ఆల్ఫోర్స్ ఆతిథ్యం ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. తెలంగాణ యోగ అసోసియేషన్ చైర్మన్ మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్ మాట్లాడుతూ యోగాకు చిరునామాగా కరీంనగర్ నిలవడం ఆనందంగా ఉందన్నారు. గతంతో పోలిస్తే నేడు క్రీడల్లో సదుపాయాలు మెరుగయ్యాయని, ప్రతిభ ఉన్న ఆటగాడికి ప్రోత్సహించేందుకు ఎంతో మంది దాతలు ముందుకు వస్తున్నట్లు చెప్పారు.వివిధ జిల్లాలోని విచ్చేసిన క్రీడాకారులు తమ నైపుణ్యాన్ని ప్రదర్శించేందుకు ఆల్ఫోర్స్ వేదికగా నిలవడం,అందుకు అనుగుణంగా చక్కటి భోజన వసతి సౌకర్యం కల్పించడం అభినందనీయమన్నారు.ఇక్కడ క్రీడాకారులు సాధించిన స్ఫూర్తితో జాతీయస్థాయి యోగాలో రాణించి రాష్ట్రానికి పేరు ప్రఖ్యాతలు సాధించి పెట్టాలన్నారు.తెలంగాణ రాష్ట్ర యోగ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్.ఎన్.రెడ్డి మాట్లాడుతూ స్వల్ప వ్యవధిలో ఘనంగా రాష్ట్రస్థాయి పోటీలను నిర్వహించిన కరీంనగర్ జిల్లా యోగ అసోసియేషన్ ను ఆయన అభినందించారు. గతంతో పోలిస్తే యోగాలో క్రీడాకారుల్లో నైపుణ్యం గణనీయంగా అభివృద్ధి చెందిందని అంతర్జాతీయ స్థాయిలో ప్రాతినిధ్యమే లక్ష్యంగా క్రీడాకారులు సాధన చేయాలన్నారు. తెలంగాణ యోగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి,జిల్లా యోగ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్ సిద్ధారెడ్డి మాట్లాడుతూ గత రెండు రోజులుగా రాష్ట్రం నలుమూలల నుండి విచ్చేసిన వెయ్యి మంది క్రీడాకారులతో చక్కటి యోగా పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. వరుసగా 17వ సారి కరీంనగర్ ఛాంపియన్గా నిలవడం ఇక్కడి క్రీడా ప్రతిభకు నిదర్శనం అన్నారు.ఇదే స్ఫూర్తితో అంతర్జాతీయ స్థాయిలో ప్రాతినిధ్యం లక్ష్యంగా ప్రణాళిక బద్ధంగా శిక్షణ పొందాలని అన్నారు. కరీంనగర్ జిల్లా క్రీడాకారులు అద్వితీయ ప్రతిభ కనబరిచి వరుసగా 17వ సారి ఓవరాల్ ఛాంపియన్షిప్ సాధించడం విశేషం. సెకండ్ ఓవరాల్ చంపియన్షిప్ గా రంగారెడ్డి మేడ్చల్ జిల్లాలో సంయుక్తంగా సాధించగా,మూడో స్థానంలో నిజామాబాద్ జిల్లా నిలిచింది.అనంతరం విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు అతిథులు ట్రోఫీలతో పాటు వ్యక్తిగత మెడల్స్ సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. జాతీయస్థాయి పోటీలో పతకం సాధించిన దీపక్,ఫెడరేషన్ బాధ్యుడైన మనోజ్ కుమార్ ను అతిథులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి జి.జనార్దన్ రెడ్డి,జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులు టి.రమేష్ రెడ్డి,కన్న కృష్ణ,రాష్ట్ర యోగ అసోసియేషన్ ఉపాధ్యక్షులు బి కమలాకర్,జిల్లా యోగ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గుంటి రామకృష్ణ,మనోజ్, స్వరూపాచారీ,గంగాధర్,కిష్టయ్య, మల్లేశ్వరీ ఆనంద్ కిషోర్, వీణావాణి,సందీప్,సత్య గోపాల్ పాల్గొన్నారు.

## బీసీల హక్కులను కాలరాసే ప్రయత్నాలను సహించం

**రెడ్డి జాగృతిపై సమగ్ర విచారణ జరపి సంస్థను రద్దు చేయాలని టీఆర్పీ డిమాండ్**

**రాష్ట్ర కార్యదర్శి మొహమ్మద్ అఖిల్ పాషా**



కరీంనగర్, సెప్టెంబర్ 12(వాయిస్ టుడే): తెలంగాణలో బీసీల హక్కులు, ఆత్మగౌరవం, రాజకీయ సామాజిక అవకాశాలకు భంగం కలిగించేలా ఏ సంస్థ వ్యవహరించినా తెలంగాణ రాజ్యాధికార పార్టీ చూస్తూ ఊరుకోదని పార్టీ రాష్ట్ర కార్యదర్శి మొహమ్మద్ అఖిల్ పాషా స్పష్టం చేశారు. రాష్ట్ర పార్టీ కార్యాలయం ఇచ్చిన పిలుపు మేరకు కరీంనగర్ జిల్లాలో ఉన్న టిఆర్పీ నాయకత్వంతో కలిసి 'రెడ్డి జాగృతి' సంస్థ కార్యకలాపాలపై కరీంనగర్ టౌన్ ఏసీపీకిఫిర్యాదు చేసి, అనంతరం మీడియా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా అఖిల్ పాషా మాట్లాడుతూ కుల సంఘాల పేరుతో సమాజంలో విభజనలకు దారితీసే విధంగా, బీసీల హక్కులకు మరియు సామాజిక న్యాయానికి విఘాతం కలిగించే ప్రయత్నాలు జరుగుతున్నాయనే ఆరోపణలపై ప్రభుత్వం,పోలీస్ యంత్రాంగం సమగ్రంగా పరిశీలించి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఒక వర్గం ప్రయోజనాల కోసం ఇతర బహుజన వర్గాల హక్కులను,అవకాశాలను ప్రశ్నించే పరిస్థితి రావడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి బీసీలు,ఎస్సీలు,ఎస్టీలు,మైనార్టీలు సహా అన్ని అణగారిన వర్గాలు సమాన హక్కులు,సమాన అవకాశాలు,రాజకీయ ప్రాతినిధ్యం కోసం పోరాడుతున్నాయని తెలిపారు.సామాజిక న్యాయం కోసం జరుగుతున్న ఈ పోరాటాన్ని బలహీనపరిచే ఏ ప్రయత్నాన్నైనా తెలంగాణ రాజ్యాధికార పార్టీ ప్రజాస్వామ్య పద్ధతుల్లో తీవ్రంగా ప్రతిఘటిస్తుందని హెచ్చరించారు. అగ్రవర్ణాల ప్రభుత్వంలో బీసీ,ఎస్సి, ఎస్టీ, మైనారిటి వర్గాల ఉద్యోగులకు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆయన ఆరోపించారు.అన్ని ప్రభుత్వ శాఖలలో అగ్రవర్ణ ఉద్యోగులకే ల్యాండ్ ఆర్డర్ పోస్టింగ్లు ఇస్తూ వారికి పెద్ద పీట వేస్తున్నారని అన్నారు.బీసీ ఉద్యోగులను అనగదొక్కుతున్నారని,ఇదే గనక కొనసాగితే బీసీ ఉద్యోగుల పట్ల కూడా తెలంగాణ రాజ్యాధికార పార్టీ పోరాడుతదని స్పష్టం చేశారు.రెడ్డి జాగృతి' సంస్థకు సంబంధించి బీసీల హక్కులకు విఘాతం కలిగించేలా లేదా సమాజంలో విద్వేషాలు,అలజడులకు దారితీసేలా ఏవైనా కార్యకలాపాలు జరుగుతున్నాయా అనే అంశంపై అధికారులు నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాలని అఖిల్ పాషా కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ చాంద్ పాషా,జిల్లా మహిళా అధ్యక్షురాలు రాచురి అరుణ,కార్యదర్శి ఇశ్రత్ శావాలి, రాష్ట్ర యూత్ సహాయ కార్యదర్శి మహబూబ్ అలీ,యూత్ జిల్లా అధ్యక్షుడు రాకేష్,జిల్లా మైనారిటీ ప్రధాన కార్యదర్శి అంకుష్ శావాలి,నాయకులు గుండోజు సాధనందం,కోరేపు గంగ, ధర్మారపు అనిల్ పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి

**మేధావుల సదస్సులో వక్తలు డిమాండు**



కరీంనగర్, సెప్టెంబర్ 12(వాయిస్ టుడే): భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు,సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచన దినోత్సవ కార్యక్రమాల్లో భాగంగా తెలంగాణ విమోచన కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ విమోచనం– జాతీయ వాదుల పాత్రపై మేధావుల సమావేశం నిర్వహించారు. బిజెపి జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పాల్గొన్న పలువురు మేధావులు,వక్తలు మాట్లాడుతూ భారతదేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్రం లభించిన తెలంగాణ ప్రాంతానికి స్వాతంత్రం రాలేదన్నారు. ఆనాటి హైదరాబాద్ సంస్థానం నిజాం కబంధహస్తాల్లో బందీ అయ్యిందని,నిజాం నిరంకుశ పాలన,రజాకార్ల అరాచకాల నుండి తెలంగాణ ప్రజలు విముక్తి పొందిన చారిత్రక దినం సెప్టెంబర్ 17 అని గుర్తుచేశారు.నాటి రాచరిక పాలనలో ప్రజలు అనుభవించిన యాతనలను, అణచివేతలను ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. దేశ ప్రథమ హోంమంత్రి సర్దార్ వల్లభభాయ్ పటేల్ దృఢ సంకల్పంతో చేపట్టిన ఆపరేషన్ పోలో'చారిత్రక విజయం సాధించడం వల్లే హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైందని స్పష్టం చేశారు.తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను,నాటి విమోచన ఉద్యమ వాస్తవాలను మరుగున పడేసేలా కొందరు రాజకీయ లబ్ధి కోసం ప్రయత్నిస్తున్నారని వక్తలు మండిపడ్డారు.ఓటు బ్యాంకు రాజకీయాల కారణంగా గత పాలకులు ఈ చారిత్రక దినాన్ని అధికారికంగా నిర్వహించడానికి వెనుకాడారని విమర్శించారు. తెలంగాణ సమాజం సాధించుకున్న స్వేచ్ఛా స్ఫూర్తిని,త్యాగాల చరిత్రను భావితరాలకు,నేటి యువతకు అందించాల్సిన బాధ్యత మేధావులపై, విద్యావేత్తలపై ఉందని అభిప్రాయపడ్డారు. విమోచన దినోత్సవ చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని,ప్రతి ఏటా ప్రభుత్వం అధికారికంగా ఈ వేడుకలను నిర్వహించాలని డిమాండ్ చేశారు. సమావేశానికి అధ్యక్షత వహించిన జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం మాట్లాడుతూ తెలంగాణ విమోచన దినోత్సవ ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరికీ తెలియజేసేలా జిల్లా వ్యాప్తంగా విస్తృత కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.సెప్టెంబర్ 17న ప్రతి గ్రామస్థాయిలో,వార్డుల్లో జాతీయ జెండాలు ఎగురవేసి,విమోచన యోధుల త్యాగాలను స్మరించుకోవాలని పిలుపునిచ్చారు.ఈ పోరాట చరిత్రను ప్రతి ఇంటికి తీసుకువెళ్లేందుకు యువత, మేధావులు స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు.ఈ కార్యక్రమంలో బిజెపి మాజీ జిల్లా అధ్యక్షులు బాస సత్యనారాయణ రావు,రాష్ట్ర అధికార ప్రతినిధి డిప్యూటీ మేయర్ సునీల్ రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి,జిల్లా ప్రధాన కార్యదర్శి మాడవెంకటరెడ్డి,పార్లమెంట్ కన్వీనర్ బోయిన్పల్లి ప్రవీణ్ రావు,సీనియర్ నాయకులు గుజ్జ శ్రీనివాసరావు బిజెపి నాయకులు,కార్యకర్తలు,మేధావులు, విద్యావేత్తలు,సామాజిక విశ్లేషకులు పాల్గొన్నారు.

Printed by Published by : **Kotha Laxman** on behalf of Kotha Laxman, printed at and published at 10-5-336/2-1, Kishan Nagar, **Editor: Kotha Laxman.**